# కేజ్రీవాల్‌ను మించి హామీల జల్లులు !

నేటినిజం

శనివారం 28-11-2020

గ్రేటర్ ఎన్నికల ప్రచారం ముగుస్తున్న వేళ ఆయా పార్టీల మేనిఫెస్టోను పరిశీలిస్తే స్వర్గాన్ని హైదరాబాద్‌లో దింపుతామన్న రీతిలో హామీలు ఉన్నాయి. ఉట్టికెక్కలేనోడు స్వర్గానికి ఎక్కినట్లు అమలు సాధ్యం కానీ హాలు ఇస్తున్నారు. అధికారంలో ఐదేళ్ల పాటు ఉన్న టిఆర్ఎస్ కూడా ఓట్ల కోసం పెద్దపెద్ద హామలు గుప్పించింది. సకాలంలో ఎందుకు వరద సాయం ఇవ్వలేకపోయిందో అధికార పార్టీ చెప్పలేదు. ఈ దశలో ఎన్నికలు పట్టడం, వరదసాయం బిజెపి ఆపిందని ప్రచారం చేయడం అధికార పార్టీ తీరును తెలియ చేస్తోంది. ఇకపోతే బిజెపి, కాంగ్రెస్ పార్టీలు తక్కువ తినలేదు. వరదసాయంపై హామీలు గుప్పిస్తున్నారు. ఇలా ఉచిత హామీలను ఇస్తున్న వారిలో ఎవరు నిజాయితీ పరులో గుర్తించాలి. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి. ఖచ్చింతంగా ఓటేసి నగరాన్ని ఎవరైతే సక్రమంగా తీర్చి దిద్దగలరో, వసతులు కల్పించగలరో ప్రజలు ఆలోచన చేయాలి. హామీలు, తాయిలాలకు లొంగితే నగర జీవనం దుర్భరం కాగలదు. అయితే బిజెపి కేంద్రం నుంచి సాయం తెప్పింస్తుందో ఏమో కానీ కాంగ్రెస్ ఎక్కడి నుంచి తెస్తుందో తెలియదు. ఇకపోతే పరస్పర ఆరోపణలు తారాస్థాయికి చేరాయి. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీగా చెప్పుకున్న కేజ్రీవాల్ అనుసరించిన ఉచిత హామీలను అన్ని పార్టీలు అనుసరించాయి. అక్కడి ప్రజలు అన్నీ ఉచితం అని చెప్పి ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ గెలుపొందారు. ఇక్కడా సిఎం కెసిఆర్ ఎన్నికల ముందు అవేరకమైన హామీలు గుప్పించారు. కేజ్రీవాల్‌ను ఉదామరించారు. ఈ క్రమంలో పార్టీలన్నీ తమ ప్రచారంలో వీటిపైనే ప్రధానంగా ప్రచారం చేస్తున్నాయి. ఉచితంగా ఇళ్లు కట్టిస్తాం... విద్యుత్, నల్లా నీళ్లు, ఇంటర్నెట్ సదుపాయమూ, ట్యాబ్‌లు ఉచితమే... సిటీ బస్సులు, మెట్రో రైళ్లలో మహిళల ప్రయాణాలన్నీ ఫ్రీ... ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తాం... చలాన్లు కట్టాల్సిన పనిలేదు... కులాలవారీగా లబ్ధి కలిగిస్తాం... వరద బాధితులకు రూ. వేలల్లో పరిహారం. ఇవీ గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు ప్రధాన రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీలు. ఒక పార్టీ నెలకు 20 వేల లీటర్లు ఉచితం అంటే మరో పార్టీ 30 వేల లీటర్లు ఉచితమని, ఇంకో పార్టీ నల్లా బిల్లే కట్టాల్సిన పనిలేదంటూ పోటీలు పడి వరాలు కురిపిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ ఓట్లే లక్ష్యంగా హామీల వర్షం కురుస్తోంది. టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మేనిఫెస్టోలను పరిశీలిస్తే ఇదే అవగతమవుతోంది. గతం కంటే భిన్నంగా రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు ఈసారి రక్తి కడుతున్నాయి. గ్రేటర్ ప్రజలను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు ఎడాపెడా హామీలు ఇచ్చేస్తున్నాయి. చలాన్ల రద్దు, మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు, వరద సాయం రూ. 50 వేలు లాంటి హామీలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యంగా వరద సాయం కింద బాధిత కుటుంబానికి రూ. 50 వేలు ఇస్తామని కాంగ్రెస్ అంటోంది. రూ. 25 వేలు ఇస్తామని బిజెపి చెబుతోంది. పదివేల సాయాన్ని అడ్డుకున్న వారు ఇవెలా ఇస్తారని టిఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. పార్టీలు చెబుతున్న మాటలు ప్రజల్లో ఆశలు రేపుతున్నా అంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తారనే ప్రశ్న వస్తోంది. అలాగే ఇలాంటి హామీలపై మేధావుల్లో చర్చ కూడా జరుగుతోంది. ఎన్నికల ముందు అన్నీ ఫ్రీ హామీలపై అడ్డుకట్ట వేయడం ఎలా అన్న ప్రశ్న అందరిలోనూ కనిపిస్తోంది. గ్రేటర్ బ్జడెట్ పరిధి ఎంత, ఈ ఉచిత హామీల అమలుకు నిధులు ఎక్కడి నుంచి తెచ్చి నెరవేరుస్తారనే ప్రశ్నలకు రాజకీయ పార్టీల వద్ద సమాధానం లేదు. అయితే హైదరాబాద్ ప్రజలు ఏటా రూ. లక్ష కోట్ల పన్నులు కడుతున్నారని, అన్నీ లెక్కలు కట్టిన తర్వాతే ఎన్నికల హామీలు ఇస్తున్నామని, అవి ఎలా అమలు చేయాలో తమకు తెలుసని పార్టీల నాయకులు చెప్పుకొస్తు న్నారు. నగరంలో డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం నిర్వమనకే వందల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. వీటికి నిధులు సరిపోవడం లేదు. ఇక మంచినీరు మౌళిక సదుపాయాల కల్పిన తదితర అంవాలను పూర్తిగా పాలకులు విస్మరించారు. నగరంలో కాలుష్యం పెరిగిపోతోంది. ఇవన్నీ ఎక్కడా ప్రస్తావనకు రావడంలేదు.

టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మేనిఫెస్టోలను పరిశీలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సిన పనులు, తీసుకోవాల్సిన నిర్ణయాలను జీహెచ్ఎంసీ ఎలా అమలు చేస్తుందనే సంశయం గ్రేటర్ ఓటర్లలో వ్యక్తమవుతోంది. రూ. 10 వేల కోట్ల ప్రత్యేక నిధి, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఉచిత విద్యుత్, ఆస్తిపన్ను రద్దు, ఎల్ఆర్ఎస్ రద్దు లాంటివి అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటే జీహెచ్ఎంసీ తరపున ఎలా చేస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వచ్చే అంశాలు, అక్కడి నుంచి వచ్చే నిధులు కూడా నేరుగా జీహెచ్ఎంసీకి వచ్చే పరిస్థితి లేని నేపథ్యంలో ఏం జరుగుతుందోననే ఆసక్తి నెల కొంది. మొత్తానికి ఎన్నికలు అనగానే ప్రచారంతో పాటు ఓటర్లను ఆకట్టుకోవడం కూడా ముఖ్యమే. ఇకపోతే బస్తీ ఓటర్లను ఆకర్షించేందుకు వారిని ప్రలోభ పెట్టేందుకు అభ్యర్థులు తాయిలాలు ఇవ్వడం పరిపాటి. ఒక్కోసారి అవి తాహతుకుమించినవిగా ఉంటున్నాయి. డబ్బులు లేదా వస్తు రూపంలో బస్తీ ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించడంతో పాటు కాలనీ, అపార్ట్‌మెంట్‌ల సంక్షేమ సమితిలకు గాలం వేస్తున్నారు. చదువుకున్న వారి ఓట్లకు గాలం వేసేందుకు సంక్షేమ సమితిలను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. తటస్థంగా ఉన్న ఓట్లను ఎలాగైనా తమ వైపు తిప్పుకునేందుకు డబ్బు ఎంతైన ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదు. అపార్ట్‌మెంట్ వాసుల ఓట్లు కొల్లగొట్టేందుకు సీసీ కెమెరాలు పెట్టిస్తామని కూడా వాగ్దానం చేస్తున్న ఘటనలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో అపార్ట్మెంట్లు, కాలనీల్లో 35 శాతం మించి ఓట్లు పోలవ్వవు. ఇలాంటి ఓట్ల పై కన్నేసిన వారు కాలనీ వాసుల ఓట్లు కొల్లగొట్టేందుకు హామీలు గుప్పిస్తున్నారు. ఇలా చేయడం వల్ల గెలిచిన తరవాత ఎంతగా కొల్లగొడుతారో ప్రజలు ఆలోచించాలి. ఓటు వేయడం విధిగా భావించాలే తప్ప తాయిలాలకు, ఉచిత హామీలకు లొంగితే నగర ప్రజలపై నాయకులు స్వారీ చేస్తారని గుర్తుంచుకోవాలి.

## అపార్ట్‌మెంట్ వాసులకు తాయిలాలు

రంగారెడ్డి,నవంబర్27(ఆర్ఎన్ఎ): నగర శివారు ప్రాంతానికి చెందిన ఓ డివిజన్‌కు చెందిన రాజకీయ నేత సుమారు 600 మంది ఓటర్లు ఉన్న అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. ఓటు అడగటంతో పాటు అందరికీ వీకెండ్ సందర్భంగా హోటల్‌లో విందును ఏర్పాటు చేశాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ ఉల్లాసంగా గడిపేందుకు వినోదాలను ఏర్పాటు చేశాడు. మరో నియోజకవర్గంలో సీనియర్ సిటిజన్‌లకు ఓ పార్టీకి చెందిన అభ్యర్థి రెండు లక్షల రూపాయలు వెచ్చించి వారందరికీ కార్తీక మాసం పురస్కరించుకొని శ్రీశైలం పంపిస్తానంటూ హామీ ఇచ్చారు. మరో డివిజన్ ఉన్న ఓ కుల సంఘం సభ్యులందరూ వన భోజనాలకు వెళ్లేందుకు అభ్యర్థి కీసరగుట్టకు పంపించాడు. ఈ కార్యక్రమానికి ఆ అభ్యర్థి కూడా హాజరై తనకు ఓటు వేయాలని అభ్యర్థించాడు. మొత్తానికి కాలనీ వాసులను కూడా ప్రలోభ పెట్టేందుకు అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో చూడాలి. ఇలాంటి హామీల పట్ల అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

## ప్రతిపక్షాల దూకుడుతో కెసిఆర్ బెంబేల్

### విజయశాంతి ఆరోపణలు

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధినేత ప్రతిపక్షాల దూకుడును తట్టుకోలేక బెంబేలెత్తిపోతున్నారని నటి విజయశాంతి విమర్శించింది. ఎంఐఎం పార్టీతో కలసి కుట్రలు చేసి ప్రత్యర్థి పార్టీలకు చెందిన అభ్యర్థులను చివరి క్షణంలో పోటీ నుంచి తప్పించేందుకు కుయుక్తులు పన్నుతున్నారనే అనుమానాలు బలపడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఎంఐఎం నేతలు మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే దానిని కట్టడి చేయకపోగా నిలదీసిన పార్టీలపై పోలీసు బలగాలను వినియోగిస్తు న్నారని విజయశాంతి విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రతిపక్షాల దూకుడును తట్టుకోలేక బెంబేలెత్తిపోతున్న టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంఐఎం పార్టీతో కలసి కుట్రలు చేసి ప్రత్యర్థి పార్టీలకు చెందిన అభ్యర్థులను చివరి క్షణంలో పోటీ నుంచి తప్పించేందుకు కుయుక్తులు పన్నుతున్నారనే అనుమానాలు బలపడుతున్నాయి. ఎంఐఎం నేతలు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే దానిని కట్టడి చెయ్యకపోగా ఎంఐఎం దౌర్జన్యాన్ని నిలదీసిన పార్టీలను నియంత్రించే విధంగా పోలీసు బలగాలను ప్రయోగించడానికి సీఎం దొరగారు మాస్టర్ ప్లాన్ వేశారని వార్తలు వస్తున్నాయి. ఇంతకాలం ఎన్నికల్లో పోటీ చేసే ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను హైజాక్ చెయ్యడం లేదా ఎన్నికలు పూర్తయిన తర్వాత గెలిచిన ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను ప్రలోభపెట్టి ఫిరాయింపులను ప్రోత్సహించడం కేసీఆర్ కి అలవాటుగా మారింది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇలాంటి రాజకీయాలు ఫలించవని నిర్ణయానికి రావడంతో ఏకంగా బలమైన ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను శాంతి భద్రతల పేరుతో బరిలో నుంచి తప్పించడానికి గులాబీ బాస్ కొత్త ఎత్తుగడ వేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ కుట్రలకు పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తే తెలంగాణ సమాజం సహించదు... క్షమించదని విజయశాంతి పేర్కొన్నారు.

## భద్రాచలం అడవుల్లో పులి సంచారం

### అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

కొత్తగూడెం,నవంబర్27(ఆర్ఎన్ఎ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెద్దపులి కలకలం సృష్టిస్తున్నది. జిల్లాలోని అశ్వాపురం మండలం రామచంద్రపురం, సారపాక అడవిలో పెద్ద పులి తిరిగినట్లు అటవీ అధికారులు ఆనవాళ్లు గుర్తించారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పశువులను మేపడానికి అడవిలోకి వెళ్లకూడదని సూచించారు. కాగా, నిన్న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ సమీపంలోని పెద్దవాగులో పెద్దపులి కనిపించింది. వాగు పరీవాహక ప్రాంతంలోని చేలల్లో పత్తి ఏరుతున్న కూలీలు సాయంత్రం నాలుగు గంటల సమయంలో పెద్దవాగులో పులి నీరుతాగుతుండగా గుర్తించారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు పులి ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అగర్‌గూడ సమీపంలోని పెద్దవాగు ప్రాంతంలో పులి సంచరించిన విషయం వాస్తవమేనని ఎఫ్ఆర్వో తెలిపారు.

## లాలూ సీఎం పదవి ఆఫర్ చేశారు

### -జితిన్ రామ్ మాంఝీ సంచలన వ్యాఖ్యలు

పాట్నా,నవంబరు 27(ఆర్ఎన్ఎ): బీహార్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం జితన్ రామ్ మాంఝీ ఇప్పుడు ఓ షాకింగ్ విషయం బయటపెట్టాడు. ఇటీవల ఆయన 'లాలూ ప్రసాద్ యాదవ్ ను కూడా జైలు నుంచి పిలిపించారు' అని పేర్కొన్నారు. ఇటీవల ఓ వెబ్ సైట్ తో జరిపిన సంభాషణలో ఆయన మాట్లాడుతూ.. 'లాలూ తనను జైలు నుంచి పిలిచి ముఖ్యమంత్రి పదవి ఆఫర్ చేశారు' అని చెప్పారు. ఇంకా ఆయన మాట్లాడుతూ లాలూ యాదవ్ డజన్ల కొద్దీ సార్లు తనను సంప్రదించాడు. ప్రభుత్వ ఏర్పాటుకు గ్రాండ్ అలయెన్స్ కు సహాయం చేస్తే తాను ముఖ్యమంత్రిని చేస్తానని ఎన్నికల అనంతరం లాలూ తనకు చెప్పారు. లాలూ ప్రసాద్ యాదవ్ పై బీజేపీ నేత సుశీల్ కుమార్ మోదీ ఈ ఆరోపణలు చేశారు. 'బీహార్ ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి ప్రయత్నిస్తున్నాడు' అని ఆయన అన్నారు. జైలు నుంచే పిలుపునివ్వడం ద్వారా ఎన్డీఏ ఎమ్మెల్యేల పార్టీ మారేందుకు లాలూ ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. బిజెపి ఎమ్మెల్యే లల్లన్ పాశ్వాన్ కూడా ఆయన వెంట వచ్చి లాలూ యాదవ్ పిలుపును అందుకున్నారని ఆరోపించారు. నిన్న, లాలూ ప్రసాద్ యాదవ్ కు ఫోన్ కాల్ వచ్చిందని తన పీఏ ఫోన్ ఎత్తారని లల్లన్ చెప్పాడు. లల్లన్ మాట్లాడుతూ, 'ఆయన మాట్లాడినప్పుడు, మొదట లాలూ యాదవ్ అభినందించి, తరువాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో సాయం కోరారు. దీనిపై లలాన్ అందుకు నిరాకరించింది.

## రైతులు ఆందోళనలు విరమించండి

### చర్చలు జరపడానికి కేంద్రం సిద్ధం

### కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

న్యూఢిల్లీ,నవంబరు 27(ఆర్ఎన్ఎ): రైతులతో చర్చలు జరపడానికి కేంద్రం సిద్ధంగానే ఉందని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ప్రకటించారు. రైతులు చేస్తోన్న ఆందోళనలను విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చర్చల ద్వారా కచ్చితంగా ఓ పరిష్కారం లభిస్తుందని, రైతులకున్న అపోహలు కూడా తొలగిపోతాయని ఆయన తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలు ప్రస్తుత పరిస్థితులకు అత్యంత ఆవశ్యకరమైనవని, అవి దేశంలో అత్యంత విప్లవాత్మకమైన మార్పులు తేస్తాయని ఆయన పునరుద్ఘాటించారు. పంజాబ్ రైతుల్లో నిండిపోయిన అపోహలను తొలగించే విషయంలో పంజాబ్ కార్యదర్శితో మాట్లాడామని, తిరిగి డిసెంబర్ మూడో తేదీన మరోమారు మాట్లాడతామని తోమర్ తెలిపారు

## శతవసంతాల గండిపేట ఉస్మాన్ సాగర్ జలాశయం

1908లో హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలు ఎదుర్కొన్న 'గ్రేట్ మూసీ వరదలు' మిగిల్చిన జల ప్రళయ దుఃఖానికి విరుగుడుగా 1920లో 7వ నిజాం ఉస్మాన్ అలీ ఖాన్, నిజామ్ హైదరాబాద్ స్టేట్ మూసీ ఉపనది ఈసా నదిపై గండిపేట సమిపాన ఉస్మాన్ అలీ ఖాన్ పేరుతో 'ఉస్మాన్ సాగర్' జలాశయం నిర్మించబడింది. నగరాన్ని వర్షాకాల వరదల నుంచి కాపాడడానికి మరియు వేసవిలో తాగు నీటి కొరతను తీర్చడానికి గండిపేట చెరువు(జలాశయం)ను సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సాంకేతిక సహకారంతో ఆధునిక ఇంజనీరింగ్ నైపుణ్యంతో నిర్మించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. హైదరాబాద్‌కు తాగునీరు అందిస్తూ, వరదలను అడ్డుకుంటున్న గండిపేట జలాశయం గత 100 సంవత్సరాలుగా నగరవాసులకు విశేష సేవలను అందిస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో నిర్మించిన ఉస్మాన్ సాగర్ సరస్సు 46 చదరపు కిమీ (29 చదరపు కిమీ గండిపేట జలాశయం) పూర్తి వైశాల్యంతో 3.9 టియంసీల నీటి సామర్థ్యం మరియు 1,790 ఫీట్ల గరిష్ట నీటిమట్టాన్ని కలిగి ఉంది. ఉస్మాన్ సాగర్ సమీపాన నిజాంకు వేసవి విడిది నిమిత్తం 'సాగర్ మహల్' అనబడే అద్భుత అతిథి గృహం నిర్మించబడింది.

వారసత్వ సంపదగా గుర్తించబడిన ప్రముఖ పర్యాటక కేంద్రమైన సాగర్ మహల్ నుండి అద్భుత గండిపేట జలాశయ అందాలను వీక్షించడానికి అనుకూలత ఉంది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసిన ఉస్మాన్ సాగర్ పరిసర ప్రాంతాల్లో పార్కులు, రిసార్టులు మరియు అమ్యూజ్‌మెంట్ పార్కులు ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయబడ్డాయి. నగరానికి పశ్చిమాన 20 కిమీ దూరంలో ఉన్న గండిపేట చెరువు విదేశీ ప్రజలతో సహ అందరికీ విహార స్థలంగా ఖ్యాతి గాంచింది. మూసీకి ఉపనదిగా ఉన్న ఈసా నదిపై మానవ నిర్మితమైన గండిపేట చెరువు చుట్టు పక్కల పచ్చటి వాతావరణంలో విలక్షణ వృక్షజంతు జాలం చూపరులకు అహ్లాదకర విందును కళ్ల ముందు నిలుపుతున్నది. పిక్నిక్, ఫోటోగ్రఫీ, వైవిధ్యభరిత పక్షులు, ఓసియన్ పార్క్, ఎల్స్ వరల్డ్, ట్రెజర్‌లాండ్, ఈత కొలను, సాగర్ మహల్, బోటింగ్ విహార వసతులు, పలు హోటల్స్ మరియు పలు ఆకర్షణీయ వసతులు కల్పించబడినవి. 1920లో నగర జనాభా 5 లక్షలకు తాగునీటిని సమకూర్చే నిమిత్తం నిర్మించబడిన గండిపేట చెరువు నేటి కోటి జనాభాకు కూడా తాగునీటిని అందించే ప్రధాన ఆధారంగా నిలుస్తున్నది. నేటి పాలకులు నగర పరిసర ప్రాంతాలను గుర్తించి వరదలను తట్టుకునేలా మరియు తాగునీటిని అందించేలా మరికొన్ని జలాశయాలను నిర్మించాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర రాజధానికి మణిపూసగా నిలుస్తున్న గండిపేట ఉస్మాన్ సాగర్ జలాశయ వైభవాన్ని గుర్తించి 'శతవసంతాల గండిపేట ఉస్మాన్ సాగర్' వేడుకలను జరుపుకుందాం. జీవవైవిధ్యానికి పెద్ద పీట వేస్తున్న గండిపేట చెరువును ఆరాదిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ప్రధాని పర్యటన..కెసిఆర్ బహిరంగ సభ

### మోడీ రాకపై సర్వత్రా ఉత్కంఠ

### కెసిఆర్ సభను దెబ్బతీసేందుకే అన్న చర్చ

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): ఓవైపు గ్రేటర్ ఎన్నికల్లో ప్రచారం తుదిదశకు చేరుకుంటున్న సమయంలో.. ప్రధాని నరేంద్ర మోడీ.. హైదరాబాద్ పర్యటన ఆసక్తికరంగా మారింది. ప్రధాని పర్యటన రోజే టిఆర్ఎస్ నిర్వహించే కెసిఆర్ సభ ఉండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సహజంగానే దీనిపై అనుమానాలు వస్తున్నాయి. కెసిఆర్ సభ రోజే ప్రధాని రావడం, అది కూడా కరోనా వ్యాక్సిన్ గురించి రానుండడంతో ప్రజల దృష్టి దీనిపైనే ఉంటుంది. ప్రధాని పర్యటన కేవలం భారత్ బయోటెక్‌లో కరోనా వ్యాక్సిన్ గురించి మాత్రమే అయినా దానిని గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చూస్తున్నారు. అయితే గ్రేటర్ ఎన్నికలను బిజెపి ప్రతిష్టగా తీసుకోవడం, ప్రదాని మోడీ భారత్ బయోటెక్‌కు రావడం వంటి విషయాలను రాజకీయకోణంలోనే చూనస్తున్నారు. ఓ వైపు ప్రధాని పర్యటన..మరోవైపు సిఎం కెసిఆర్ ప్రచారంతో శనివారం నగరంలో ఇది కీలకమైన రోజు కాబోతోంది... ఆదివారం ప్రచారం ముగియ నుండటంతో... ముందురోజే అగ్రనేతల కార్యక్రమాలు ప్లాన్ చేశాయి. టీఆర్ఎస్ శనివారం ఎల్బీ స్టేడియంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ జరగనుండగా... అదే టైమ్‌లో హైదరాబాద్‌లో ప్రధాని మోడీ పర్యటనకు

వస్తుండటం... ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది. శనివారం మధ్యాహ్నం ప్రధాని 3 గంటలా 45 నిమిషాలకు హకీంపేట ఎయిర్‌పోర్టుకు రానున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి.. 4.10 గంటలకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ దాదాపు గంట సేపు గడిపే మోడీ... కరోనా వ్యాక్సీన్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకుంటారు. కార్యక్రమం పూర్తయ్యాక నేరుగా పుణె వెళతారు. గ్రేటర్ ఎన్నికలతోకానీ, ప్రచారంతో కానీ మోడీకి నేరుగా సంబంధం లేకపోయినా, హైదరాబాద్ లో ఆయన పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. సాధారణంగా ప్రధానికి సంబంధించిన ఏ పర్యటన అయినా.. రెండువారాల ముందు ఖరావుతుంది. కానీ హైదరాబాద్ భారత్ బయోటెక్ సందర్శనకు సంబంధించిన పర్యటన ఆకస్మికంగా ఖరారైంది. కరోనా వ్యాక్సిన్ తుదిదశకు చేరుకుంటున్న వేళ ప్రధాని మోడీ దీనిపై ఆసక్తిగా ఉన్నారు. అందుకే ఆకస్మిక పర్యటనగా కేంద్ర అధికారుల అంటున్నారు. అయితే మోడీ పర్యటనపై ఆసక్తి నెలకొంది. కేసీఆర్ సభతో ప్రచారాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాలనుకుంటున్న టీఆర్ఎస్‌కు కౌంటర్‌గానే... ప్రధాని పర్యటనను బీజేపీ ప్లాన్ చేసి ఉంటుందనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. బీజేపీ అగ్రనాయకత్వం మొత్తం గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటుండగా.. ఇప్పుడు ప్రధాని పర్యటన ఆసక్తిగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ... కమలం మరింత పట్టు బిగుస్తోంది. ఎలాగైనా మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని బీజేపీ అన్ని వ్యూహాలను తమ అమ్ముల పొదిలోంచి తీస్తోంది. కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలు అందరూ భాగ్య నగరానికి 'క్యూ' కడుతున్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు ప్రకాశ్ జవదేకర్, స్మృతి ఇరానీ పర్యటించి వెళ్లారు. మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, తేజస్వీ సూర్య కూడా వచ్చి వెళ్లారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఖరారు కావం ఆయన 29ననే హైదరాబాద్‌కు రానున్నారు. భారత్ బయోటెక్‌లో కరోనా వ్యాక్సిన్ పురోగతిని ప్రధాని పరిశీలించనున్నారు. అయితే జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ మోదీ రాక ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ప్రచారానికి రానున్నారు. అయితే ఆయన పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం 28 న ప్రచారానికి రావాల్సి ఉండగా మారిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారమే నడ్డా ప్రచారానికిదిగారు. ఇక... యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం జరిగే ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ నెల 29 న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా నగరానికి రానున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహించే రోడ్ షోలో ఆయన పాల్గొంటారు. హైదరాబాద్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఆయన ప్రచారం నిర్వహించనున్నారు. ఇలా గ్రేటర్ ఎన్నికల్లో అతిరథ మహారథులందర్నీ బీజేపీ బరిలోకి దింపింది. గతంలో ఎప్పుడూ లేనంతగా బిజెపి మాస్టర్ ప్లాన్‌తో ముందుకు సాగుతోంది. ఇకపోతే కెసిఆర్ బహిరంగ సభన భారీగా జరపడానికి టిఆర్ఎస్ ఏర్పాట్లు చేస్తోంది. ఇదే సమయంలో మోడీ పర్యటన ఉండడం, ఆయన భారత్ బయోటెక్ నుంచి ఏమైనా మాట్లాడుతారా అన్నది చూడాలి. జీహెచ్ ఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 28న, శనివారం సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ నిర్వహిస్తారని ఈ నెల 19న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ప్రకటించారు. కాగా, 28నే ప్రధాని హైదరాబాద్ అధికారిక పర్యటన ఖరారైంది. దీంతో గ్రేటర్ ఎన్నికల రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది.ప్రధాని మోదీ 28న మధ్యాహ్నం హైదరాబాద్ పర్యటనకు వస్తున్నారని గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. భారత్ బయోటెక్ ఫార్మా కంపెనీ తయారుచేస్తున్న 'కొవాగ్జిన్' పురోగతిని స్వయంగా పరిశీలించేందుకు ప్రధాని ఈ వర్యటనకు శ్రీకారం చుట్టినప్పటికీ.. ఇందుకోసం ఆయన ఎంపిక చేసుకున్న సమయంపై

రాజకీయాసక్తి నెలకొంది. 28న మధ్యాహ్నం ఢిల్లీ నుంచి నేరుగా మోదీ హకీంపేట సైనిక విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి శామీర్‌పేట వద్ద గల భారత్ బయోటెక్ ల్యాబ్‌ను సందర్శిస్తారు. వ్యాక్సిన్ రూపకల్పనకు కృషిచేస్తున్న శాస్త్రవేత్తల బృందంతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం పుణె పర్యటనకు వెళ్తారని అధికారవర్గాలు తెలిపాయి.

## వన్ నేషన్-వన్ ఎలక్షన్

### దేశంలో జమిలి ఎన్నికల అవసరం ఉంది

### ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): దేశంలో జమిలి ఎన్నికల అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. ప్రతీ కొన్ని నెలలకోసారి ఎన్నికలు జరగడం అభివృద్ధి పనులపై ప్రభావం చూపిస్తోందని.. కాబట్టి 'ఒకే దేశం-ఒకేసారి ఎన్నికలు' దేశ ఆవశ్యకత అన్నారు. ప్రజలపై,జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విధానాలపై రాజకీయాలు ఆధిపత్యం ప్రదర్శిస్తే దేశం ప్రతికూల మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. గురువారం(నవంబర్ 26) ఆన్‌లైన్ వేదికగా జరిగిన ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ 80వ సమావేశాల సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు.

లోక్‌సభ,అసెంబ్లీ ఎన్నికలతో పాటు పంచాయితీ ఎన్నికలకు ఒకే ఓటరు జాబితా ఉండాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. ప్రతీ ఎన్నికలకు ప్రత్యేక ఓటరు జాబితా రూపొందించడం వనరులను వృథా చేయడమేనన్నారు. జీఎస్టీ ద్వారా 'వన్ నేషన్ వన్ ట్యాక్స్' సాకారమైందని ఈ సందర్భంగా మోదీ గుర్తుచేశారు. అలాగే విద్యుత్ రంగంలో 'వన్ నేషన్ వన్ గ్రిడ్' పాలసీని కూడా విజయవంతంగా అమలుచేశామన్నారు. ఇక ఇప్పుడు 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై చర్చ జరుగుతోందని... ప్రజాస్వామిక పద్దతిలో దీన్ని కూడా తప్పక సాకారం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దేశంలో ఎప్పుడూ ఎన్నికల వాతావరణం అభివృద్ధికి ఆటంకం అని బీజేపీ మొదటినుంచి చెబుతోంది. మోదీ మొదటిసారి ప్రధాని అయినప్పుడే ఈ అంశాన్ని తెర పైకి తీసుకొచ్చారు. దీనిపై లా కమిషన్,నీతి ఆయోగ్ తమ నివేదికలను కూడా కేంద్రానికి సమర్పించాయి. లోక్‌సభ ఎన్నికలతో పాటే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాధనం ఆదా అవుతుందని లా కమిషన్ సిఫారసు చేసింది. 2024 నుంచి లోక్‌సభ,అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసింది. అయితే దేశంలోని రాజకీయ పార్టీలు ఇందుకు అంగీకారం చెబితేనే జమిలి ఎన్నికలు సాధ్యమవుతాయని కేంద్ర ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేసింది.

## చిచ్చుపెట్టి బీజేపీ చలిమంట కాచుకోవాలనుకొంటుంది

### ఆనాడు కరెంటు ఉంటే వార్త.. ఇప్పుడు కరెంటు పోతే వార్తా

### రూ. 350 కోట్లతో నియోజకవర్గంలో మంచినీళ్ల గోస తీర్చింది

### ఉద్వేగాలు కాదు.. ఉద్యోగాలు కావాలే

### అల్వాల్ రోడ్‌షోలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): ఉద్వేగాలు రెచ్చగొట్టి ఎట్టిపరిస్థితుల్లో పచ్చగా ఉన్న హైదరాబాద్‌లో చిచ్చుపెట్టాలే.. ఆ చిచ్చులో చలిమంట కాచుకోవాలే అనే ప్రయత్నం చేస్తున్నరు బీజేపీ వాళ్లు. అందుకే తమ్ముళ్లకు తాను ఒక్కటే చెబుతున్నానని ఉద్వేగాలు కాదు..ఉద్యోగాలు కావాలే అని మంత్రి కేటీఆర్ అన్నారు. గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు మల్కాజ్‌గిరి నియోజకవర్గం అల్వాల్ ఇందిరాగాంధీ చౌరస్తాలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అల్వాల్ నుంచి టీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీచేస్తున్న విజయశాంతి, మచ్చబొల్లారం నుంచి జితేంద్రనాథ్, వెంకటాపురం నుంచి సబితా అనిల్ కిశోర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సింది కోరారు.

ఐదేండ్ల కిందట ఆశీర్వదించండి పనిచేస్తమని చెప్పినం. చెప్పిన విధంగానే చేసి చూపించి నేడు మళ్లా మీముందుకు వచ్చాం. మల్కాజ్‌గిరిలో తొమ్మిదింటికి తొమ్మిది గెలిపించి బల్దియాకు పంపించారు. ఈసారి కూడా ఇదే ప్రభంజనం కొనసాగాలన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు పరిస్థితులెట్లుండెనో మనందరికి తెలుసు. ఆనాడు కరెంటు ఉంటే వార్త.. ఇప్పుడు కరెంటు పోతే వార్తా. రూ. 350 కోట్లతో మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో మంచినీళ్ల గోసను తీర్చింది కేసీఆర్ ప్రభుత్వమా కాదా ఆలోచించాలన్నారు. నేడు రోజు తప్పించి రోజు నీళ్లు ఇచ్చుకునే పరిస్థితి వచ్చినం. కేశవాపురం రిజర్వాయర్‌తో పూర్తితో అతిత్వరలోనే ప్రతీరోజు నీళ్లు ఇచ్చే బాధ్యత తమదన్నారు.

పేదవాళ్లు సంతోషంగా ఉండేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను గమనించాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, ఒక్కో వ్యక్తికి 6 కిలోల చొప్పున బియ్యం, గురుకుల పాఠశాలల ద్వారా నాణ్యమైన చదువు, ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ కింద విదేశాల్లో విద్యాబుద్ధులు, అన్నపూర్ణ సెంటర్ల ద్వారా రూ. 5కే భోజనం, పేదలకు సుస్తీ చేస్తే బస్తీ దవాఖానాలు, గల్లీ గల్లీలో సీసీ టీవీ కెమెరాలు, సీసీ రోడ్లు, ఎల్ఈడీ లైట్లు ఇలా చెప్పుకుంటేపోతే ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆనాడు ఏమన్నరు.. ఆంధ్రా-తెలంగాణ పంచాయతీ, కరెంటు ఉండదన్నారు. పెట్టుబడులు పోతాయన్నారు ఇంకా ఎన్నో దుష్ప్రచారాలు చేశారు. వీటన్నింటిని పటాపంచలు చేస్తూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధిపథంలో దూసుకుపోతుందన్నారు.

ఇక్కడ పేదవాడు సంతోషంగా ఉన్నడు కాబట్టే, ఇక్కడి పిల్లగాళ్లు టాలెంట్ ఉన్నవారు కాబట్టే హైదరాబాద్‌కు పెట్టుబడులు వస్తున్నాయన్నారు. కాగా బీజేపీ ప్రభుత్వం ఇక్కడ ఏం చేసిందో, ఏం చేస్తరో చెప్పాలని అడిగితే చెప్పరన్నారు. వేలకోట్ల రూపాయలతో సంక్షేమ, అభివృద్ధిని చేపడుతుంటే వారేమో నాలుగు ఓట్ల కోసం ఉద్వేగాలను రెచ్చగొట్టి లబ్దిపొందాలని చూస్తున్నరు. హక్కులు అడిగితే ఏర్పాటువాదులు అంటరు. వరదలొచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే 6 లక్షల 64 వేల కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున తక్షణ సాయం అందించినం. ఇది కొంతమందికి నచ్చలే. ఉత్తరాలు రాసి ఈ సాయాన్ని ఆపినరు. ఇచ్చే సాయాన్ని ఆపి తాము చేస్తామంటున్నరు. రూ. 10 వేలు ఇస్తుంటే ఆపినోడు రేపు రూ 25 వేలు ఇస్తమంటే నమ్ముతామా అన్నారు..

గ్రేటర్ ఎన్నిక స్థానిక సమరంలా లేదు. పార్లమెంట్ ఎలక్షన్‌లా ఉందన్నారు. డజనుమంది కేంద్ర మంత్రులు, పక్కరాష్ట్రాల సీఎంలు హైదరాబాద్‌కు వస్తున్నరు. కానీ సింహం సీఎం కేసీఆర్ ఎప్పుడు సింగిల్‌గానే వస్తారన్నారు. హైదరాబాద్‌కు ఐటీఐఆర్ మంజూరు అయితే దాన్ని రద్దు చేసింది మోదీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. ఇష్టమొచ్చిన మాటలు చెప్పి చక్కరొచ్చేటట్టు చేస్తే ఆగం కావద్దన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తయి, అభివృద్ధి జరుగుతది, నాలుగు ఉద్యోగాలు వస్తాయన్నారు. అప్పుడే సంక్షేమ పథకాలు అమలు జరుగుతుందన్నారు. ఢిల్లీ నుంచి వచ్చేవాళ్లతోటి ఊదు కాలదు.. పీరు లేవదు. ఇక్కడ ఉండేది మనమే. ఏదీ చేసుకున్నా మనమే చేసుకోవాలి. హైదరాబాద్‌ను అభివృద్ధిలో తీసుకుపోతున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుచుకుందామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## దేశ రాజధానిలో రికార్డుస్థాయిలో కరోనా మరణాలు

### మహమ్మారికి ఒక్కరోజే 2,300 మందిబలి

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో రికార్డుస్థాయిలో కరోనా మరణాలు సంభవిస్తున్నాయి. నెల రోజుల్లోపే ఏకంగా 2,300 మంది మహమ్మారి బారినపడి ప్రాణాలు కోల్పోవడం ఆందోళను గురిచేస్తోంది. గత నెల 28 నుంచి ఇప్పటి వరకు 2,364 కరోనా మరణాలు నమోదయ్యాయి. అలాగే, తొలిసారి కరోనా కేసులు ఒక్క రోజులో 5 వేల మార్కును చేరుకున్నాయి. తాజా గణాంకాలపై ఢిల్లీ హైకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితి చూస్తుంటే ప్రమాదకరంగా మారేలా కనిపిస్తోందని హెచ్చరించింది.

ఢిల్లీలో నిన్న 99 మంది కరోనా కారణంగా ప్రాణాలు కోల్పోగా, వీరితో కలుపుకుని ఇప్పటి వరకు 8,720 మంది మరణించారు. ఐదు రోజుల తర్వాత కరోనా మరణాలు 100కు దిగువన నమోదు కావడం గమనార్హం. ఈ నెల 19న 98 మరణాలు నమోదు కాగా, 20న 118, 21న 111, 22, 23 తేదీల్లో 121, 24న 109 మరణాలు సంభవించాయి. ఈ నెల 18న అత్యధికంగా 131 మరణాలు నమోదయ్యాయి. అలాగే, ఈ నెల 11న అత్యధికంగా 8,593 కేసులు నమోదయ్యాయి. బుధవారం నాటికి ఢిల్లీలో 5,45,787 కరోనా కేసులు నమోదు కాగా, వీరిలో 4,98,780 మంది కోలుకున్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

## పోలింగ్‌రోజున కోర్టులకు సెలవు

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసి ఎన్నికల సందర్భంగా డిసెంబరు 1న జరిగే పోలింగ్‌రోజున తెలంగాణ హైకోర్టు సెలవు ప్రకటించింది. ప్రతి ఒక్కరూ విలువైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. ఈసందర్భంగా పోలింగ్‌రోజున హైకోర్టు, సికింద్రాబాద్‌లోని తెలంగాణ జ్యూడియషియరీ అకాడమీ, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టు మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్‌సెంటర్, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ, హైదరాబాద్‌లోని అన్ని ట్రిబ్యునల్స్‌కు సెలవు ప్రకటించినట్టు హైకోర్టు రిజిస్ట్రార్‌జనరల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# పోలింగ్ రోజున పటాన్ చేరు , రామచంద్రపురంలకు లోకల్ హాలిడే..!!

**-జిల్లా కలెక్టర్ హనుమంతరావు.**



సంగారెడ్డి, నవంబర్ 27 (నేటినిజం ప్రతినిధి) జీహెచ్ఎంసీ సాధారణ ఎన్నికలలో భాగంగా డిసెంబర్ 1న జరిగే పోలింగ్ రోజును పటాన్ చేరు , రామచంద్రపురం లకు లోకల్ హాలిడే గా డిక్లేర్ చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు గురువారం నాడొక ప్రకటనలో తెలిపారు. జిహెచ్ఎంసి ఎన్నికల అథా రిటీ మరియు కమిషనర్ సూచనల మేరకు పోలింగ్ నేపథ్యంలో నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్ కింద జిల్లా లోని పటాన్చెరు, రాంచంద్రాపురం పోలింగ్ ప్రాంతాలలో డిసెంబర్ 1న ( మంగళవారం ) స్థానిక సెలవుగా ప్రకటించామని ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ రోజున ( డిసెంబర్ ,1 ) రామచంద్రాపురం ,పటాన్చెరు పోలింగ్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ,స్థానిక సంస్థలకు సెలవు దినంగా పరిగణించాలని ఆయన పేర్కొన్నారు.

# జిల్లాలోని నీటి శుద్ధి కేంద్రాలను పరిశీలించిన శ్రీమతి స్మిత సబర్వాల్.



సంగారెడ్డి నవంబర్ 27 (నేటినిజం ప్రతినిధి) ముఖ్యమంత్రి గారి ప్రత్యేక కార్యదర్శి శ్రీమతి స్మితా సబర్వాల్ గారు గురువారం రోజున సంగారెడ్డి జిల్లాలో గల పలు త్రాగునీటి శుద్ధి కేంద్రములు పెరిశీలనలో భాగంగా సదాశివపేట మండలం లోని పెద్దాపూర్ 4వ దశ (ఊఓఊచిూ ఫేస్ ఎ), పుల్కాల్ మండలం సింగూర్ వద్ద గల ఇన్టేక్ వెల్, సంగారెడ్డి మండలం రాజంపేట వద్ద గల మొదటి మరియు రెండవ దశ నిర్మాణాలు, అక్కడే ఉన్న ఇన్టేక్ వెల్, బ్యారేజ్ లను పరిశలించారు. ఈ కార్యాక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ హనుమంతరావు గారు, హైదరాబాద్ మహా నగర నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య (ఊఓచిూ) తరపున ఈడి శ్రీ సత్యనారాయణ గారు, డిటి శ్రీ రవికుమార్ గారు, జియం శ్రీ రామకృష్ణ గారు, నీటిపారుదల శాఖ తరుపున సీఈ శ్రీ మధుసూదన్ రావు గారు, ఈఈ శ్రీ మధుసూదన్ రెడ్డి గారు, మిషన్ భగీరథ శాఖ తరుపున ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీ కృపకర్ రెడ్డి గారు, సీఈ శ్రీ చక్రవర్తి గారు, ఎస్ ఈ శ్రీ రఘువీరా గారు మరియు సంబంధిత స్థానిక అధికారులు పాల్గున్నారు.

## ఎంఎస్పీ విషయంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తినా.. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటా

### రైతుల జీవితాలతో ఆడుకోవద్దు

### హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖత్తార్

న్యూఢిల్లీ,నవంబరు 27(ఆర్ఎన్ఎ): చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, రైతుల జీవితాలతో ఆడుకోవద్దని హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖత్తార్ హెచ్చరించారు. అబద్ధాలు, మోసాలు, మాయదారి ప్రచారాలకు కాలం చెల్లిందన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) విషయంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తినా తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వ్యవసాయ సంస్కరణలపై నిరసన తెలిపేందుకు పంజాబ్ నుంచి పెద్ద ఎత్తున రైతులు ఢిల్లీకి తరలి వస్తున్న నేపథ్యంలో మనోహర్ లాల్ ఖత్తార్ ట్విటర్ వేదికగా పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్పై విమర్శలు గుప్పించారు.

"మీ మోసాలు, అబద్ధాలు, ప్రచారానికి సమయం మించిపోయింది. మీ నిజ రూపాలను ప్రజలను చూడనివ్వండి. కరోనా వైరస్ మహమ్మారి సమయంలో ప్రజల జీవితాలను అపాయంలోకి నెట్టడం దయచేసి మానుకోండి. ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని నేను మిమ్మల్ని కోరుతున్నాను. కనీసం మహమ్మారి సమయంలో చౌకబారు రాజకీయాలు మానుకోండి" అని ఓ ట్వీట్లో ఖత్తార్ పేర్కొన్నారు.కెప్టెన్ అమరీందర్ సింగ్తో మాట్లాడటం కోసం మూడు రోజుల నుంచి ప్రయత్నిస్తున్నట్లు ఖత్తార్ మరొక ట్వీట్లో పేర్కొన్నారు. తనతో మాట్లాడకూడదని సింగ్ నిర్ణయించుకున్నారని, రైతు సమస్యలపై ఆయనకు ఉన్న శ్రద్ధ ఇదేనా? అని ప్రశ్నించారు. కెప్టెన్ సింగ్ కేవలం ట్వీట్లు ఇస్తున్నారని, చర్చలకు రాకుండా పారిపోతున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయోత్పత్తులకు ఎంఎస్పీ విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని గతంలో చెప్పానని, అదే విషయాన్ని మరొకసారి చెప్తున్నానని అన్నారు. అమాయకులైన రైతులను రెచ్చగొట్టవద్దని హితవు పలికారు.

ఇదిలావుండగా, ఢిల్లీ వెళ్తున్న రైతులను నిలువరించేందుకు హర్యానా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ తీవ్రంగా ఖండించారు. రైతులు ఢిల్లీ వెళ్ళకుండా ఆపవద్దని కోరారు.

## ఈనెల 30 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు..

### -నోటిఫికేషన్ విడుదల చేసిన అసెంబ్లీ కార్యదర్శి

అమరావతి,నవంబరు 27(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 30వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 5వ విడత ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు నవంబర్ 30న ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నట్లు ఓ ప్రకటలో తెలిపారు. మొదటిరోజు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రసంగించనున్నారు. ఈ మేరకు ఏపీ అసెంబ్లీ కార్యదర్శి బాలకృష్ణమాచార్యులు అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలి రోజు గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం కానుంది. బీఏసీలో సమావేశాల నిర్వహణతో పాటు చర్చించే అంశాలపై స్పష్టత రానుంది.

## 28న హైదరాబాద్కు ప్రధాని మోదీ

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీ త్వరలో హైదరాబాద్ రానున్నారు. ఆయన పర్యటన ఖరారైంది. ఈనెల 28న ఢిల్లీ నుంచి నేరుగా హకీంపేట విమానాశ్రయానికి ప్రధాని చేరుకోనున్నారు. శామీర్పేట సమీపంలోని భారత్ బయోటెక్ను మోదీ సందర్శించనున్నారు. కొవిడ్ నివారణకు సంబంధించి భారత్ బయోటెక్ సిద్ధం చేస్తున్న 'కొవాగ్జిన్' టీకా పురోగతిని పరిశీలించనున్నారు. అనంతరం ప్రధాని పుణె పర్యటనకు వెళ్లనున్నారు.జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని హైదరాబాద్కు రానుండటం ఆసక్తికరంగా మారింది. అయితే ఆయన గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు ఇప్పటికే భాజపా జాతీయ నేతలు, పలువురు కేంద్రమంత్రుల పర్యటనలు ఖరారయ్యాయి. 27న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దాస్, 28న భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, 29న కేంద్రహోంమంత్రి అమిత్షా హైదరాబాద్ రానున్నారు. వీరంతా గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ కూడా హైదరాబాద్ రానుండటం ఆసక్తికరంగా మారింది.

# 88.90లక్షల రేషన్ కార్డుదారులకు ఉచితంగా నిత్యావసరాలను పంపిణీ

### రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి నాని

గుడివాడ,,నవంబరు 27(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో 16వ విడతలో భాగంగా ఇప్పటివరకు 88 లక్షల 90 వేల 606 రేషన్కార్డుదారులకు ఉచితంగా ఒక లక్ష 26 వేల 185 మెట్రిక్ టన్నుల బియ్యం, 8 వేల 168 మెట్రిక్ టన్నుల శనగలను అందజేసినట్టు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. గురువారం మంత్రి కొడాలి నాని క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పోర్టబులిటీలో భాగంగా అనంతపురం జిల్లాలో 2 లక్షల 38 వేల 018 రేషన్ కార్డులకు, చిత్తూరు జిల్లాలో ఒక లక్ష 11 వేల 550 కార్డులకు, తూర్పుగోదావరి జిల్లాలో 3 లక్షల 54 వేల 297 కార్డులకు, గుంటూరు జిల్లాలో 4 లక్షల 35 వేల 901 కార్డులకు, వైఎస్సార్ కడప జిల్లాలో ఒక లక్ష 58 వేల 584 రేషన్ కార్డులకు, కృష్ణాజిల్లాలో 2 లక్షల 98 వేల 664 కార్డులకు, కర్నూలు జిల్లాలో 3 లక్షల 16 వేల 664 కార్డులకు, నెల్లూరు జిల్లాలో 97 వేల 073 కార్డులకు, ప్రకాశం జిల్లాలో ఒక లక్ష 57 వేల 655 కార్డులకు, విశాఖపట్నం జిల్లాలో 3 లక్షల 46 వేల 666 కార్డులకు, విజయనగరం జిల్లాలో 73 వేల 831 కార్డులకు, పశ్చిమగోదావరి జిల్లాలో 2 లక్షల 89 వేల 117 రేషన్ కార్డులకు నిత్యావసర సరుకులను అందజేశామన్నారు. అలాగే అనంతపురం జిల్లాలో 12 లక్షల 73 వేల 615 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 9 లక్షల 22 వేల 656 రేషన్కార్డులకు 13 వేల 869 మెట్రిక్ టన్నుల బియ్యం, 751 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా సరఫరా చేశామన్నారు.

చిత్తూరు జిల్లాలో 11లక్షల 88వేల 779 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 5 లక్షల 67 వేల 163 రేషన్కార్డులకు 8 వేల 543 మెట్రిక్ టన్నుల బియ్యం, 506 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా అందజేశామన్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో 17లక్షల 03వేల 597 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 10 లక్షల 91 వేల 877 రేషన్ కార్డులకు 14 వేల 835 మెట్రిక్ టన్నుల బియ్యం, 925 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా సరఫరా చేశామన్నారు. గుంటూరు జిల్లాలో 15 లక్షల 47 వేల 127 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 9 లక్షల 98 వేల 812 రేషన్ కార్డులకు 13 వేల 547 మెట్రిక్ టన్నుల బియ్యం, 965 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

వైఎస్సార్ కడప జిల్లాలో 8 లక్షల 37 వేల 057 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 5 లక్షల 62 వేల 338 రేషన్కార్డులకు 8 వేల 305 మెట్రిక్ టన్నుల బియ్యం, 540 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా సరఫరా చేశామన్నారు.

కృష్ణాజిల్లాలో 13 లక్షల 47 వేల 292 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 7 లక్షల 37 వేల 422 రేషన్కార్డులకు 10 వేల 016 మెట్రిక్ టన్నుల బియ్యం, 696 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా సరఫరా చేశామన్నారు.

కర్నూలు జిల్లాలో 12 లక్షల 43 వేల 324 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 8 లక్షల 87 వేల 285 రేషన్కార్డులకు 13 వేల 658 మెట్రిక్ టన్నుల బియ్యం, 854 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా అందజేశామన్నారు.

నెల్లూరు జిల్లాలో 9 లక్షల 33 వేల 193 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 3 లక్షల 41 వేల 165 రేషన్ కార్డులకు 4 వేల 562 మెట్రిక్ టన్నుల బియ్యం, 326 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా సరఫరా చేశామన్నారు. ప్రకాశం జిల్లాలో 10 లక్షల 25 వేల 455 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 5 లక్షలు 60 వేల 036 రేషన్కార్డులకు 7 వేల 956 మెట్రిక్ టన్నుల బియ్యం, 539 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. విశాఖపట్నం జిల్లాలో 13 లక్షల 20 వేల 321 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 9 లక్షల 13 వేల 714 రేషన్ కార్డులకు 12 వేల 979 మెట్రిక్ టన్నుల బియ్యం, 874 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా సరఫరా చేశామన్నారు.

విజయనగరం జిల్లాలో 7 లక్షల 16 వేల 349 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 4 లక్షల 91 వేల 630 రేషన్ కార్డులకు 6 వేల 974 మెట్రిక్ టన్నుల బియ్యం, 450 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 12 లక్షల 93 వేల 075 రేషన్ కార్డులు ఉండగా వీటిలో 8 లక్షల 16 వేల 508 రేషన్ కార్డులకు 10 వేల 937 మెట్రిక్ టన్నుల బియ్యం, 737 మెట్రిక్ టన్నుల శనగలను ఉచితంగా అందజేశామని మంత్రి కొడాలి నాని తెలిపారు.

# అంబేద్కర్ స్ఫూర్తిని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుంది

### ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ కల్పించే 59 జీవో దేశానికే దిక్సూచి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): కాంట్రాక్టులలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ కల్పించే 59 జీవో దేశానికే దిక్సూచి అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ రెడ్హిల్స్లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్, సీఐడీఐలు సంయుక్తంగా రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆలోచనలు ప్రపంచానికి ఆదర్శం అన్నారు. రాజ్యాంగం భారతీయ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందన్నారు.

అంబేద్కర్ ఆలోచనలు భారతదేశంలో అట్టడుగు జాతుల ఉన్నతికి దోహదపడ్డాయన్నారు. కమిషన్ ఏర్పాటు తర్వాత దళిత ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే విధంగా కమిషన్ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేసి దళిత, గిరిజన హక్కులకు కమిషన్ అండగా ఉందన్నారు. కాంట్రాక్టులలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ కల్పించే 59 జీవో దేశానికే దిక్సూచి అన్నారు. దళిత, గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనే సీఎం కేసీఆర్ నిబద్ధతకు ఈ జీవో నిదర్శనమన్నారు.

అంబేద్కర్ ఆలోచనలు, ఆయన బాటలోనే కమిషన్ను నడిపిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు సమాన హక్కులు కల్పించింది ఆయనే అన్నారు. దళిత గిరిజనులు న్యాయం పొందడంలో ఇబ్బంది పడవద్దనే ఆలోచనతో జన అదాలత్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యులు విద్యాసాగర్ మాట్లాడుతూ కొందరి వాడు కాదని అంబేద్కర్ అందరివాడన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పుట్టపాగ శ్రీనివాస్, రాజశేఖర్, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# లవ్ జిహాద్'కు పాల్పడితే 10ఏళ్ల జైలు

### మధ్యప్రదేశ్ సర్కారు కొత్త ముసాయిదా చట్టం

భోపాల్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్ ప్రభుత్వం లవ్ జిహాద్కు వ్యతిరేకంగా చట్టం చేసింది. దేశంలోనే తొలిసారిగా ఓ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేసిన చట్టం ఇది. ఇస్లాం మతానికి చెందిన యువకులు హిందూ యువతులకు ప్రేమించి వివాహం చేసుకుని, వారిని ఇస్లాంలోకి మార్చడాన్ని లవ్ జిహాద్ కింద పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి 10ఏళ్ల జైలు శిక్ష విధించేలా ఫ్రీడం ఆఫ్ రిలీజియన్ అనే కొత్త చట్టం రూపొందించారు.ఆ రాష్ట్ర సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, తమ రాష్ట్రంలో ఇక మీదట లవ్ జిహాద్ను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని, మోసం చేసి బలవంతంగా మతాంతర పెళ్లి చేసుకుని, ఆ తరువాత మతమార్పిడి చేసేందుకుప్రయత్నించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈ చట్టం గురించి రాష్ట్ర హోంశాఖ మంత్రి నరోత్తం మిశ్రా హర్షం వ్యక్తం చేశారు. వివాహం ద్వారా మతమార్పిడులకు పాల్పడేవారికి ఈ చట్టం గట్టి గుణపాఠం నేర్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లవ్ జిహాద్కు పాల్పడే వారికి ఈ చట్టం ద్వారా గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్ష విధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా లవ్ జిహాద్ కేసులో నిందితులను అరెస్టు చేసిన తరువాత 45 రోజుల వరకు బెయిల్ కూడా లభించకుండా ఈ చట్టాన్ని రూపొందించినట్లు వివరించారు.అంతేకాకుండా మతాంతర వివాహాలు చేసే మత గురువులకు 5ఏళ్ల జైలు, నిర్దిష్ట జరిమానా విధించేలా చర్యలుంటాయని, మత మార్పిడులను ప్రోత్సహించే సంస్థలను పూర్తిగా రద్దు చేసే అధికారం రాష్ట్ర సర్కార్కు ఉంటుందని హోం మంత్రి చెప్పారు. డిసెంబరు 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శీతాకాల సమావేశాల్లో ఈ చట్ట ఆమోదం కోసం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు హోం మంత్రి నరోత్తం మిశ్రా వెల్లడించారు.సరిగ్గా ఒక్కరోజు క్రితం యూపీ సర్కార్ కూడా లవ్జిహాద్కు వ్యతిరేకంగా ఓ ఆర్డినెన్సును ఆమోదించింది.

# ప్రచారానికి పరిదులేవి?

### గాడి తప్పిన గ్రేటర్ ప్రచారం

### అవదుల్లేని నాయకుల మాటలు

### మితిమీరిన వ్యాఖ్యలు

### ఆదిపత్యం దాహంతో రెచ్చగొట్టే ప్రకటనలు

### చోద్యం చూస్తున్న ఎలక్షన్ కమిషన్

### విధ్వంసాలకు దారితీసే అవకాశం

### నాయకుల ఆత్మ విమర్శలే అసలైన పరిష్కారం

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): స్థానిక ఎన్నికల్లో సాధారణంగా స్థానిక సమస్యలే కీలకంగా ఉంటాయి. స్థానిక సమస్యలు, ప్రజల అవసరాల అంశాలపైనే గతంలో ప్రచారాలు జరిగేవి. కాని ఈసారి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో స్థానిక అంశాల ప్రస్తావనే రావడం లేదు. జాతీయ , అంతర్జాతీయ అంశాలు గ్రేటర్ ఎన్నికల్లో ప్రచారాస్త్రాలుగా మారిపోయాయి. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. విద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ కలకలం రేపుతున్నారు లీడర్లు. రోహింగ్యాలు.. పాకిస్తాన్.. సర్జికల్ స్ట్రైక్.. కూల్చేస్తాం.. తరమికొడతాం. ఇవి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో వినిపిస్తున్న మాటలు. నిన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్ నగరంలో నేతల విద్వేశ పూరిత ప్రసంగాలు దుమారం రేపుతున్నాయి. అన్ని పార్టీల నేతలు పోటీపడి మరీ నోటికి పనిచెబుతున్నారు. ఒకరిని మించి మరొకరు రెచ్చగొట్టే ప్రసంగాలతో విరుచుకుపడుతున్నారు. ఇష్టమెచ్చినట్లుగా మాట్లాడుతూ అలజడి రేపుతున్నారు. జనం సమస్యలు పట్టించుకోకుండా.. కాంట్రవర్సీ కామెంట్లతో కాక రేపుతున్నారు. ప్రచారాల తీరు, నేతల దూకుడుతో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ప్రచారం దారి తప్పిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రేటర్ ఎన్నికల్లో జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులతో నగర ప్రజల్లో ఆందోళన కూడా పెరుగుతోంది.

బీజేవైఎం చీఫ్, బెంగళూరు బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య రాకతో మొదలైన గ్రేటర్ రాజకీయ వేడి తారాస్థాయికి చేరింది. మంగళవారం హైదరాబాద్ లో పర్యటించిన సూర్య.. ఎంఐఎం నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్తాన్ ఏజెంట్గా పనిచేస్తున్నారని విమర్శించారు.అసద్ ను పాకిస్తాన్ జాతిపిత మహ్మద్ అలీ జిన్నాతో పోల్చారు సూర్య. దేశ విభజన సమయంలో హైదరాబాద్ సంస్థానాన్ని పాకిస్తాన్లో విలీనం చేయాలని జిన్నా డిమాండ్ చేశారని, ఒవైసీ కూడా అదే ఆలోచన విధానం ఉన్న వ్యక్తి అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్లో పెద్ద ఎత్తున రొహింగ్యాలు, పాకిస్తాన్ ఓట్లు ఉన్నాయని.. పాకిస్తాన్ మద్దతు దారులే ఎంఐఎం పార్టీలో ఉన్నారని వ్యాఖ్యానించారు. తేజస్వి సూర్య విమర్శలపై ఒవైసీ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్లో పాకిస్తాన్, రొహింగ్యా ఓటర్లు ఉంటే కేంద్రహోం మంత్రి అమిత్ షా ఏం చేస్తున్నారు..? నిద్రపోతున్నారా? అంటూ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే భాగ్యనగరంలో రొహింగ్యాలకు షెల్టర్ ఇచ్చారని ఒవైసీ గుర్తుచేశారు.

ఇక తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలతో అలజడి సృష్టిస్తున్నారు. గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే పాతబస్తీలో సర్జికల్ స్ట్రైక్ చేస్తామన్న ఆయన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. సంజయ్ కామెంట్స్ తెలంగాణలోనే కాకుండా దేశ వ్యాప్తంగానూ హాట్ టాపిక్గా మారాయి. సంజయ్ వ్యాఖ్యలపై దుమారం రేగుతుండగానే.. ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ రెచ్చిపోయారు. అక్రమ కట్టడాల తొలగింపుపై మాట్లాడుతూ.. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, మాజీ సీఎం ఎన్టీఆర్ ఘాట్స్ను కూల్చివేయాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అక్బర్ కామెంట్లకు కౌంటరిచ్చిన బండి సంజయ్.. పీవీ, ఎన్టీఆర్ సమాధులు కూల్చివేస్తే రెండు గంటల్లో ఎంఐఎం కార్యాలయం దారుస్సలాంను నేలమట్టం చేస్తామని హెచ్చరించ్చారు. బండి సంజయ్. అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రేటర్ ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు చేస్తున్న ప్రసంగాలపై నగర ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని, ప్రస్తుత పరిణామాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయం వస్తుందని చెబుతున్నారు. గ్రేటర్ ప్రచారంలో జరుగుతున్న పరిణామాలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా పథకాలు, మేనిఫేస్టోలు తయారుచేసి, ఓటర్లను ఆకర్శించాలే గానీ ఇలా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలుకుతున్నారు. నాయకులు ఆత్మ వింర్షలు చేసుకొని, ప్రభుత్వ వైఫల్యాలపై , తమతమ మేనిఫెస్టోలపై దృష్టిపెట్టి హద్దుమీరకుండా వుంటే, ప్రశాంతమైన భాగ్యనగరం మరింత ప్రశాంతంగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఉద్యోగులూ ఆలోచించండి

### మార్పునకు ముందుకు రండి

### రాజేంద్రనగర్ ప్రచారంలో స్వామిగౌడ్ పిలుపు

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత ఇప్పుడు ఆలోచన చేయాలని, తమ ఆకాంక్షలను ప్రస్తుత టిఆర్ఎస్ పాలకులు నెరవేర్చారా లేదా అన్నది చూడాలని మండలి మాజీ ఛైర్మన్, బిజెపిలో చేరిన స్వామిగౌడ్ పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్లో శుక్రారం బిజెపి నిర్వహించిన ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఆర్సీ,ప్రమోషన్లు, ఉద్యోగ విరమణ వయస్సు పెంపు వంటి సమస్యలను ప్రస్తావించారు. ఇవన్నీ ఆలోచించడానికి ఇదే తగిన సమయమని అన్నారు. మన ఉద్యోగాలన్నీ ఆంధ్రోళ్లు తన్నుకుపోయారని, తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని, మన ఉద్యోగాలు మనకే అని ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రకటించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉద్యమ పార్టీ టీఆర్ఎస్ గెలిస్తే నెల రోజుల్లోపు రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. ఉద్యోగాలు వస్తాయనే ఆశతో నిరుద్యోగులు ప్రాణాలకు తెగించి పోరాటాలు చేశారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ మాటలు నమ్మి టీఆర్ఎస్ పార్టీకి ఓట్లేసి గెలిపించారు. కానీ, రెండో దఫా టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా.. నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదు. ఇప్పటికైనా ఖాళీల భర్తీ మొదలుపెట్టకపోతే గ్రేటర్ ఎన్నికల్లో నిరుద్యోగులు టీఆర్ఎస్కు షాక్ ఇచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో స్వామిగౌడ్ బిజెపి వేదిక నుంచి ఇవే అంశాలను ప్రస్తావించడం విశేషం. అధినాయకుడిని కలిసే అవకావమే రావడం లేదన్నారు. తను తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించినా తనను పక్కన పెట్టారని అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆలోచన చేయాలన్నారు. మార్పుకు నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్వింద్ తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్, బీజేపీ మజ్లిస్ పార్టీలు డ్రామాలాడుతున్నాయి

### ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు

### ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు

### సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికల వేళ హైదరాబాద్లో ఏం జరుగుతోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క బీజేపీ, ఎంఐఎం, టీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. పీవీ, ఎన్టీఆర్ ఘాట్లను కూల్చేస్తానని మజ్లిస్ నాయకుడు అక్బరుద్దీన్ అనడాన్ని తీవ్రంగా ఖండించారు. బీజేపీ నేతల మాటలు దారుణంగా ఉన్నాయన్నారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా ఉండి ఆయన చేసే వ్యాఖ్యలు ఇవేనా అని విమర్శించారు. ఓ పక్క కరోనా విజృంభిస్తున్న నాయకులు లెక్కచేయడం లేదన్నారు. కరోనా, వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న కనిపించడం లేదా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్, బీజేపీ మజ్లిస్ పార్టీలు డ్రామాలాడుతున్నాయన్నారు. ప్రజల రక్షణను గాలికొదిలేశారన్నారు.

బీజేపీ, ఎంఐఎం, టీఆర్ఎస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ నాయకులు నగరాన్ని అభివృద్ధి చేయకుండా పబ్బం గడిపారన్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదని, మళ్లీ కొత్త హామీలతో ప్రజలను టీఆర్ఎస్ నాయకులు మభ్యపెడుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ ఉండి కూడా వరదల సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బీజేపీ, ఎంఐఎం, టీఆర్ఎస్ మూడూ ఒక్కటేనని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రజలు ఈ మూడు పార్టీలను చిత్తుగా ఓడించాలని ఆయన జోస్యం చెప్పారు.

## ఓట్ల కోసం భాజపా, తెరాస, ఎంఐఎం కొత్త ప్రయోగం

### ప్రజాస్వామ్యంలో ఉన్నామనే విషయాన్ని మర్చి అనుచిత వ్యాఖ్యలు

### తెలంగాణ తెదేపా అధ్యక్షుడు ఎల్. రమణ

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రజలకు ఏం చేయాలనే విషయాన్ని విస్మరించిన భాజపా, తెరాస, ఎంఐఎం పార్టీలు.. ఓట్ల కోసం కొత్త ప్రయోగం చేస్తున్నాయని తెలంగాణ తెదేపా అధ్యక్షుడు ఎల్. రమణ ఆరోపించారు. దుబ్బాక ఫలితాలతో సీఎం కేసీఆర్కి ఓటమి భయం పట్టుకుందని.. అందుకే రూ.10వేలు వరద సాయం ప్రకటించారన్నారు. ఎన్టీఆర్ భవన్లో రమణ మీడియాతో మాట్లాడారు. వరద సాయం అందించడంలోనూ తెరాస నేతలు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. ప్రజల మధ్య ఉండే అభ్యర్థులతో తెదేపా ఎన్నికల బరిలోకి దిగితే, భాజపా, తెరాస, ఎంఐఎం పార్టీలు నేర చరితులకు సీట్లు కేటాయించాయని విమర్శించారు.

కొంత మంది నేతలు ప్రజాస్వామ్యంలో ఉన్నామనే విషయాన్ని మర్చిపోయి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని రమణ ఆక్షేపించారు. తెలుగు జాతి కీర్తిని ఇనుమడింపజేసిన పెద్దలు, స్ఫూర్తిదాతల విగ్రహాలు ట్యాంక్ బండ్ మీద ఉన్నాయని, అలాంటివారి స్మారకాలను కూల్చేయాలని కొంత మంది నేతలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా ఎన్టీఆర్కి భారతరత్న ఇవ్వని భాజపా.. ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తోందని ఎద్దేవా చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తీరులో మార్పు రావాలని, ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తాత్కాలిక ప్రయోజనాలను మాత్రమే చేకూరుస్తాయని వివరించారు. ఒవైసీ మెడికల్ కళాశాలను ఆక్రమణకు గురైన స్థలంలోనే నిర్మించారని.. ఆ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం బయట పెట్టాలన్నారు. సీఎం కేసీఆర్ శాంతి భద్రతలు తన అధీనంలో ఉన్నాయని చెబుతున్నారని, అలా అయితే నగరంలో రోహింగ్యాలు ఉన్నారా? లేదా? అన్న విషయాన్ని స్పష్టంగా చెప్పాలని రమణ డిమాండ్ చేశారు.

## బీహార్ ఎన్నికలపుడు కరోనా నిబంధనలు గుర్తుకురాలేదా?

### నిబంధనల కారణంగానే రైతులను అడ్డుకున్నామని

### చౌతాలా పేర్కొనడం శోచనీయం

### స్వరాజ్ ఇండియా చీఫ్ యోగేంద్ర యాదవ్

న్యూఢిల్లీ,నవంబరు 27(ఆర్ఎన్ఎ): కరోనా నిబంధనల కారణంగానే రైతులను అడ్డుకున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా పేర్కొనడం శోచనీయమని, ఇటీవల రైతులతో ఆయన ర్యాలీ నిర్వహించినపుడు కరోనా నిబంధనలు గుర్తుకు రాలేదా అని స్వరాజ్ ఇండియా చీఫ్ యోగేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. బిజెపికి చెందిన మనోహర్లాల్ కత్తార్ ప్రభుత్వానికి కరోనా ఒక అవకాశంగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. మూడు రోజుల క్రితం దుష్యంత్ చౌతాలా వేలాది మంది రైతులతో ర్యాలీ నిర్వహించారని, భౌతిక దూరం కూడా పాటించలేదని, అప్పుడు కరోనా లేదా అని ప్రశ్నించారు. బీహార్ ఎన్నికల సమయంలోనూ కరోనా లేదు. రైతులు తమ హక్కుల కోసం పోరాడుతున్నపుడు మాత్రం బిజెపి ప్రభుత్వానికి కరోనా మహమ్మారి కనిపిస్తోందని అన్నారు. ఢిల్లీ చేరుకోకుండా వేలాది మంది రైతులను అడ్డుకునేందుకు హర్యానా సరిహద్దుల్లో వారిపై వాటర్కెనాన్లు, టియర్గ్యాస్ను వినియోగించారని, రైతుల ఉద్యమాన్ని అడ్డుకునేందుకు కరోనాను ఒక సాకుగా చూపారని అన్నారు. రైతుల సమ్మెను అణచివేసేందుకు ప్రభుత్వం వినియోగించిన వ్యూహాలు.. స్వాతంత్ర్య సమరయోధులపై బ్రిటీష్ వారు వినియోగించిన ఎత్తుగడలను గుర్తు చేశాయని అన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసినట్లు తమ హక్కుల కోసం పంజాబ్లోని రైతులు పోరాటం చేయాల్సివస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్రంలో గుంపులుగా గుమిగూడటంపై నిషేధం విధిస్తున్నట్లు బుధవారం హర్యానా ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నిబంధనను ఉల్లంఘించారని ఆరోపిస్తూ యోగేంద్ర యాదవ్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## దిశాకు... ఏడాది!

హైదరాబాద్,నవంబరు 27(ఆర్ఎన్ఎ): దిశా... ఈ పేరు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు అన్నీ కూడా విస్మయం వ్యక్తం చేసాయి. శంషాబాద్ శివారులోని తొండుపల్లి టోల్గేట్ సమీపంలో నవంబర్ 27న వెటర్నరీ డాక్టర్ దిశ బైక్ కు పంచర్ చేసి డ్రామా ఆడి అనంతరం బలవంతంగా తీసుకెళ్లి నలుగురు దుర్మార్గులు హైదరాబాద్ శివారుల్లో... షాద్ నగర్ వద్ద అత్యాచారానికి ఒడిగట్టి.. కిరాతకంగా సజీవ దహనం చేయడం చాలా మందిని కలవరపెట్టింది. ముందు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత విచారణ చేసారు.

మరుసటి రోజే కేసును చేధించి వెంటనే.. నలుగురు నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన తర్వాత తెలుగు రాష్ట్రాలతో పాటూ దేశవ్యాప్తంగా నిరసనలు జరగడమే కాకుండా వాళ్ళను కాల్చి చంపాలి అని మహిళా సంఘాలు ఆందోళనలకు దిగాయి. నలుగురు నిందితుల్ని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి.. రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తీసుకుని వెళ్ళారు. ఆ సమయంలో వారిని జైలుకు తీసుకెళుతుండగా.. ప్రజలు వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేసారు. కొద్ది రోజులకు నిందితుల్ని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ వేసారు.అందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ తర్వాత నలుగురు నిందితుల్ని సీన్ రీ కన్స్ట్రక్షన్ చేసేందుకు తీసుకెళ్లగా.. వారు ఎదురు తిరిగి పోలీసులుపై దాడికి దిగడంతో ఎన్కౌంటర్ చేయాల్సి వచ్చిందని పోలీసులు చెప్పారు. అప్పుడు జరిగిన పోలీసుల కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. తర్వాత ఈ ఎన్ కౌంటర్ పై మానవ హక్కుల సంఘం విచారణ.. ఆ వెంటనే సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసారు. ప్రస్తుతం ఈ కేసు ఘటన విచారణ జరుగుతుంది. కాగా సైబరాబాద్ సీపీ సజ్జనార్ పై ప్రసంశలు వ్యక్తమయ్యాయి. ఆయనను అప్పుడు సోషల్ మీడియాలో హీరోలా చూసారు అందరూ.

## ఆంధ్రప్రదేశ్లో తగిన కరోనా కేసులు..!

అమరావతి,నవంబరు 27(ఆర్ఎన్ఎ): ఆంధ్ర ప్రదేశ్ లో కొత్తగా 831 కరోనా కేసులు నమోదయ్యాయి. వీటితో కలిపి మొత్తం కొవిడ్ బాధితుల సంఖ్య 8,64,674 కి చేరింది. తాజాగా మహమ్మారి బారిన పడి మరో 6 మంది మృతి చెందగా.. మొత్తం మరణాల సంఖ్య 6,962కి చేరింది. 1,176మంది బాధితులు కోలుకోగా.. రాష్ట్రంలో ఇప్పటివరకు 8.45 లక్షల మంది వైరస్?ను జయించి క్షేమంగా ఇంటికి చేరారు. ప్రస్తుతం 12,673 కరోనా యాక్టివ్ కేసులున్నాయి. రాష్ట్రంలో 24 గంటల వ్యవధిలో 60,726 కరోనా పరీక్షలు చేయగా.. ఇప్పటివరకు 97.88 లక్షల శాంపిల్స్ పరీక్షించినట్లు ప్రభుత్వం విడుదల చేసిన బులెటిన్?లో పేర్కొంది.రాష్ట్రంలో కొత్తగా 831 కరోనా కేసులు నమోదయ్యాయి. వీటితో కలిపి మొత్తం కొవిడ్ బాధితుల సంఖ్య 8,64,674 కి చేరింది. తాజాగా మహమ్మారి బారిన పడి మరో 6 మంది మృతి చెందగా.. మొత్తం మరణాల సంఖ్య 6,962కి చేరింది.

# ఆరేళ్లయినా నిరుద్యోగులకు దక్కని హామీ

## ఖాళీలు ఉన్నా భర్తీ కాని పోస్టులు
## సర్వీస్ కమిషన్ రెగ్యులర్ క్యాలెండర్ ఏదీ
## గ్రేటర్ ఎన్నికల వేళ నిరుద్యోగుల ఆందోళన

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ వచ్చి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరేండ్లు గడిచినా నిరుద్యోగ సమస్య తీరలేదు. ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఒత్తిడికి గురై ఇప్పటికే అనేక మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పీజీలు, డాక్టరేట్లు తెచ్చుకున్న వాళ్లు కూడా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్‌గా భర్తీ చేయాల్సిన పోస్టులు భర్తీ కావడం లేదు. అలాగే పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు నామ్‌కే వాస్తేగా జరిగాయి. ఈ దశలో గ్రేటర్‌లో నిరుద్యోగులు, ఉద్యోగులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇంటికో ఉద్యోగం హామీపై గడికో మాట మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రులు నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఎప్పుడూ చెప్పలేదని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. అలాంటి అవకాశం లేదన్నారు. రాష్ట్రంలో కోటి 13 లక్షల కుటుంబాలు ఉన్నాయని, ఇన్ని ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యమా?అన్నారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగింది. దాదాపు 1,500 మంది నిరుద్యోగులు, విద్యార్థులు బలిదానాలు చేసుకున్నారు. తమకు అవకాశాలు రాకపోవడం, హామీలు నెరవేరక పోవడంతో నిరుద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఇప్పుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య 11 లక్షలు. ప్రభుత్వ శాఖల్లో దాదాపు రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడానికి టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నిస్తున్నాయి. టీఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు ముందు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల పద్ధతిని పూర్తిగా వ్యతిరేకించింది.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో శాశ్వత ఉద్యోగాలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కలిపి 6.4 లక్షల మంది ఉంటారు. ఇందులోనే రిటైర్మెంట్ ఖాళీలు కూడా కలిసి ఉన్నాయి. ప్రస్తుతం శాశ్వత ఉద్యోగాలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కలిపి నాలుగు లక్షల మంది వరకూ ఉన్నట్లు అంచనా. ఒకవైపు జనాభా పెరుగుతోంది. బడ్జెట్ పెరుగుతోంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెరుగుతున్నాయి. కానీ దానికి తగ్గట్టు ఉద్యోగాల సంఖ్య మాత్రం పెరగడం లేదు. కనీసం ఖాళీల భర్తీకి కూడా చర్యలు తీసుకోవడం లేదు. తాము అధికారంలోకి వస్తే పర్మినెంట్ పద్ధతిలోనే భర్తీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలోనూ హామీ ఇచ్చింది. కానీ ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చడం లేదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదు. సమర్థులైన, ప్రతిభావంతులైన యువతకు ఉద్యోగాలు కల్పిస్తే ఉత్సాహంతో, అంకితభావంతో పనిచేస్తారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడతారు. ఉద్యోగాల భర్తీలో ఇంకా ఇదే నిర్లక్ష్యం కొనసాగడం వల్ల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నిరుద్యోగ యువత తమ ఓటును ఎటువైపు వేస్తున్నారన్న ఆసక్తి పార్టీల్లో నెలకొంది.

ఎవరికి వారు వారి మద్దతు తమకే అన్న ధోరణిలో ఉన్నారు. ఇకనైనా నిరుద్యోగుల కోసం ఉద్యోగాల భర్తీ చేపట్టాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్ పై ఉంది. ఇప్పటికైనా ఉద్యోగాల భర్తీకి సంబంధించి క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరుతున్నారు.

# తెలంగాణలోనే మతకలహాలు

## భైంసా, కరీంనగర్‌లనే జరిగాయి
## బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా జరిగాయా?
## నగర ప్రచారంలో ఎంపి ధర్మపురి అర్వింద్ విమర్శ

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): దేశంలో మత కలహాలు కేవలం తెలంగాణలోనే జరుగుతున్నాయని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా ఇలాంటి ఘటనలు లేవని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. భైంసాలో జరిగిన అల్లర్లకు కారణమెవరని ప్రశ్నించారు. ఎంపిఎ కాళ్ల ముందు మోకరిల్లిన కారణంగా హిందువులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. రాజేంద్ర నగర్‌లో నిర్వహించిన జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అర్వింద్ టీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. భైంసా, కరీంనగర్‌ల్లో మత కలహాలు జరుగుతున్నాయని అర్వింద్ చెప్పారు. హిందువుల మీద దొంగ కేసులు పెడుతున్నారని, హిందూ పండుగలను జరుపుకోనివ్వడం లేదని మండిపడ్డారు. ఎంఐఎం చేతిలో అమ్ముడుపోయిన వేస్ట్ ఫెలోలు కేసీఆర్, కేటీఆర్ అని విమర్శించారు. 'హిందువుల ఆత్మగౌరవాన్ని మొత్తంగా అమ్మేసిన దుర్మార్గుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. మనందరం కలసి హిందూ సమాజం నుంచి కేసీఆర్‌ను బర్తరఫ్ చేయాలి. ఇందూర్‌లో, దుబ్బాకలో రాజుకున్న మాదిరిగా జీహెచ్ఎంసీలోనూ అగ్గి రాజుకోవాలి. కేంద్రం నుంచి బీజేపీ జాతీయ నేతలు దిగుతున్నారని, వరదల సమయంలో ఎందుకు రాలేదని కెటిఆర్ తదితరులు అంటున్నారని అర్వింద్ అన్నారు. మరి అల్లర్లు జరిగినప్పుడు, వరదలు వచ్చినప్పుడు కెసిఆర్ ఎందుకు రాలేదన్నారు. కావాలనే విమర్శలుచేయడం మినహా మరోటి లేదన్నారు. ప్రజల ఒత్తిడి పెరిగిందని, ఈ ఒత్తిడికి భయపడి కేసీఆర్ ఆత్మహత్య చేసుకోవద్దు. ఏడేళ్లు సీఎంగా ఉన్నావ్ కదా అదే చాలు. జీహెచ్ఎంసీలో టీఆర్ఎస్‌కు 99 సీట్లు ఇస్తే 100 పనులు చేశారట. చేసిన అభివృద్ధేం లేదు. జిమ్‌లు పెట్టినం, రోడ్లు ఊడ్చినం అంటున్నారు' అని అర్వింద్ పేర్కొన్నారు. ఇవేనా అభివృద్ధి అంటే అని ప్రశ్నించారు. ప్రచార కార్యక్రమంలో మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ అభివృద్ధి నివేదిక ఓ డొల్ల ప్రకటన

## జాతరకు వచ్చినట్లుగా బిజెపి నేతలు వస్తున్నారు
## ఆ రెండు పార్టీలే ఎన్నికల వాతావరణం కలుషితం చేశాయి
## మండిపడ్డ కాంగ్రెస్ నేతలు పొన్నాల, సంపత్

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): మ్యానిఫెస్టోలు, ప్రొగ్రెస్ రిపోర్టులు వెబ్‌సైట్‌లో పెట్టి తీసేయడం టిఆర్ఎస్‌కు మాత్రమే సాధ్యమని మాజీ టీపీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. మేడిపండు కంటే దారుణంగా టీఆర్ఎస్ ప్రొగ్రెస్ రిపోర్టు ఉందని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎవరి సొమ్మని 17,500 కోట్లు మెట్రోరైలుకు ఖర్చు చేశారని ప్రశ్నించారు. నిజానికి మెట్రో ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ ప్రారంభించగా, కేసీఆర్ దాన్ని ఆపేశారన్నారు. 'నీవల్ల ప్రజలకు అసౌకర్యం కలిగింది. ముక్కు నేలకు రాస్తావా? తప్పు ఒప్పుకుంటావా?' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ విడుదల చేసింది అభివృద్ధి ప్రణాళిక కానే కాదని, అదొక అవినీతి నివేదిక అని, దీనిపై విచారణ జరిపించి నిజనిజాలు బయటకు తేల్చాలని తెలిపారు. 'రాష్ట్రంలో ఒక్క మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి చేయలేదు. యాదాద్రి, భద్రాద్రి ఎక్కడ ఉంది? అన్నీ గత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన విద్యుత్ ప్రాజెక్టులే. విద్యుత్ కొనుగోలు చేయడం కూడా ప్రగతేనా? ఐటికి 2100 కోట్లు ఖర్చు చేశామంటున్న టీఆర్ఎస్.. యానిమేషన్ గేమింగ్ 400 కోట్లతో కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. ఏడు సంవత్సరాల నుంచి దాన్ని ఎందుకు పూర్తి చేయలేదు. చర్చకు రమ్మంటే ముఖం చాటేసిన టీఆర్ఎస్ నాయకులు ప్రజలకు క్షమాపణలు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఇకపోతే గ్రేటర్ ఎన్నికల కోసం బీజేపీ నాయకులు జాతరలు, సంతలకు వచ్చినట్లు వస్తున్నారని, ఒక్క నవోదయ స్కూల్ తెలంగాణకు కేటాయించని స్మృతి ఇరానీ ఏ ముఖం పెట్టుకుని వచ్చారంటూ విమర్శించారు. తెలంగాణకు ఏం చేశారో చెప్పుకుని కేంద్ర మంత్రులు ఓట్లు అడిగితే బాగుండేదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో అశాంతి పాలన చేసిన యోగిఆదిత్య తెలంగాణలో కూడా అలానే ఉండాలని ఇక్కడకు వస్తున్నారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎప్పుడూ మతపరమైన వ్యాఖ్యలు చేయదు, వాటిని సమర్థించదని పేర్కొన్నారు. విద్యుత్ చార్జీలు చెల్లించడంలో రైతులు ఆలస్యం చేశారని ట్రాన్స్ ఫార్మర్కు తాళం వేసిన పరిస్థితులు తెలంగాణలో నెలకొనడం దౌర్భాగ్యమని అన్నారు. ఇదిలావుంటే ఎన్నికల వాతావరణాన్ని బీజేపీ, టీఆర్ఎస్ కలుషితం చేస్తున్నాయని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ విమర్శించారు. ప్రశాంతమైన హైదరాబాద్‌ను చెడగొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. విచ్చలవిడిగా వ్యాఖ్యలు చేస్తే.. చూస్తూ ఊరుకోమన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కౌన్సిలర్‌కు తక్కువ.. మున్సిపల్ చైర్మన్‌కు ఎక్కువని ఎద్దేవా చేశారు. సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని వ్యాఖ్యలు చేయాలన్నారు. కుట్రలకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నప్పుడు.. సీఎం కేటీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదని సంపత్ కుమార్ ప్రశ్నించారు.

# భారీగా టీఆర్ఎస్‌లో చేరికలు




హైదరాబాద్, నవంబర్ 27: టీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. మొన్నటి వరకు ఆ బస్తీలో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించి అభిమానులున్నారు. కానీ తాజా రాజకీయ పరిణామాలు బస్తీలో మార్పును తీసుకొచ్చాయి. ప్రజలను రెచ్చగొట్టే విధంగా బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యల పట్ల నిరసనగా రాజ్‌నగర్ వాసులు తమ పంథాను ఒక్కసారిగా మార్చుకున్నారు. బీజేపీతో పాటు కాంగ్రెస్‌కు అండగా ఉన్న బస్తీవాసులంతా ఏకమై బోరబండ టీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థి బాబా ఫసియుద్దీన్‌ను ఆహ్వానం మేరకు టీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ బాబా ఫసియుద్దీన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంగళవారం జరుగనున్న గ్రేటర్ ఎన్నికల పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటేసి బాబా ఫసియుద్దీన్ విజయానికి సహకరిస్తామని బస్తీవాసులు పేర్కొన్నారు.

# కరోనా వ్యాక్సిన్ ప్రకటనలతో ఆర్థికరంగానికి ఊపు

## కరోనా వ్యాక్సిన్ ప్రకటనలతో ఆర్థకరంగానికి ఊపు
## క్రమంగా కొలుకుంటున్న ప్రపంచ ఆర్థికవ్యవస్థ
## స్టాక్ మార్కెట్లకు మళ్లీమంచి రోజులు

న్యూఢిల్లీ,నవంబర్27(ఆర్ఎన్ఎ): కొవిడ్-19కు త్వరలో వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తోందన్న ఆశలతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ కుదుటపడుతున్నాయి. భారతదేశం కూడా ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ప్రజలు కూడా తమ రోజువారీ కార్యక్రమాల్లో బిజీగా మారారు. పెళ్లిళ్లు పేరంటాలు సాగుతున్నాయి. ఓ వైపు రెండో దశ కరోనా విజృంభణ ఉందని అంటున్నా ప్రజలు జీవనభృతి కోసం ఇల్లు వదలాల్సి వస్తోంది. ఎవరికి వారు రక్షణ చర్యలు తీసుకుంటూనే ముందుకు సాగుతున్నారు. ఫైజర్, మోడెర్నా వంటి అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ సంస్థలు కొవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావశీలత ఆశించిన స్థాయిలో ఉందని ప్రకటించటం మార్కెట్లకు ఊపునిచ్చింది. ఆగస్టు, సెప్టెంబరు వరకు ఓ మోస్తరుగా ఉన్న ఆర్థిక, స్టాక్ మార్కెట్ల కార్యకలాపాలు అక్టోబరు నుంచి అమాంతం పెరిగిపోయాయి. వ్యాక్సిన్ మూడో దశ క్లినికల్ ప్రయోగాల్లోకి అడుగుపెట్టడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ.. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ట్రేడవుతూ ఇన్వెస్టర్లకు కాసులు కురిపిస్తున్నాయి. అక్టోబరు మొదటి వారం నుంచి ఇప్పటి వరకు చూస్తే భారత మార్కెట్లు 12 శాతం పెరగటం విశేషం. అమెరికా కొత్త అధ్యక్షుడు జో బైడెన్ బాధ్యతలు చేపట్టగానే మరిన్ని ఉద్దీపనలు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది కూడా భవిష్యత్‌లో స్టాక్ మార్కెట్లకు కలిసిరానుందని అంచనా. కొవిడ్ కారణంగా చమురు, రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు తగ్గటంతో స్టాక్ మార్కెట్లు, బంగారం వంటి విలువైన లోహాల్లోకి పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను మళ్లించారని వారంటున్నారు. మార్కెట్లోకి ఒకసారి వ్యాక్సిన్ వచ్చిన తర్వాత వీరు తమ పెట్టుబడులను ఈక్విటీల నుంచి భిన్న రంగాల్లోకి మళ్లించే అవకాశం ఉండడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించటం మంచిదని సూచిస్తున్నారు. అంతర్జాతీయంగా అన్ని దేశాల్లో కార్యకలాపాలు సాధారణ స్థాయిలకు చేరుకుంటుండడంతో పాటు ఉద్యోగావకాశాలు మెరుగుపడుతున్నాయి. ఇదే సమయంలో పలు దేశాల స్టాక్ మార్కెట్లు వృద్ధి పథంలో సాగుతున్నాయి.ఈ ఏడాది మార్చిలో కనిష్ఠ స్థాయిలకు పతనమైన స్టాక్ మార్కెట్లు క్రమంగా కోలుకుని ప్రస్తుతం ఇన్వెస్టర్లకు సిరులు కురిపిస్తున్నాయి. కరోనా కారణంగా ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోయి ప్రపంచ వృద్ధి రేటు మైనస్‌లోకి జారుకుంది. ఇదే సమయంలో భారత్ సహా అంతర్జాతీయంగా పలు స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. కరనా మహమ్మారి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు తలకిందులు కావటంతో అమెరికా సహా పలు దేశాలు ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు భారీ ఉద్దీపన ప్యాకేజీలను ప్రకటించాయి. అమెరికా ప్రకటించిన ప్యాకేజీలతో అక్కడి ఆర్థిక వ్యవస్థలో నిధుల లభ్యత గణనీయంగా పెరిగిపోయింది. పేరుకుపోయిన నిధులను.. పెట్టుబడులుగా మార్చేందుకు అక్కడి విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు భారత్ వంటి వర్ధమాన దేశాల స్టాక్ మార్కెట్లలోకి వాటిని గుమ్మరించారు. ఇది భారత స్టాక్ మార్కెట్లకు ఎంతగానో కలిసివచ్చింది. ఎఫ్‌పీఐల నిధుల ప్రవాహం వెల్లువెత్తటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలబాట పట్టాయి. భారత మార్కెట్లు మధ్యమధ్యలో చిన్న

ఆటుపోట్లు ఎదుర్కొన్నా వాటిని అధిగమిస్తూ వచ్చాయి. ఇదే సమయంలో మార్కెట్లోకి వచ్చిన పబ్లిక్ ఇష్యూలు కూడా మంచి లాభాలతో లిస్ట్ కావటం కలిసివచ్చింది. బ్యాంక్ డిపాజిట్లు, చిన్న మొత్తాల పొదుపుపై వడ్డీరేట్లు తగ్గటంతో రిటైల్ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఈక్విటీల్లోకి మళ్లించటం కూడా స్టాక్ మార్కెట్ దూకుడుకు కారణంగా ఉంది.

# ఎన్నికల్లో విధ్వంసానికి కుట్ర

## మత ఘర్షణలు, విద్వేశాలు సృష్టించేందుకు ప్రయత్నాలు
## రెచ్చగొట్టే ప్రసంగాలపై చర్యలు తీసుకుంటాం
## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
## ఖచ్చితమైన సమాచారం ఉందన్న డీజీపీ
## కఠిన చర్యలు తప్పవు
## ఎంతటివారైనా వెనుకాడేది లేదని వెల్లడి

హైదరాబాద్,నవంబరు 27 (ఆంఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను ఆసరా చేసుకొని హైదరాబాద్ నగరంలో, తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని చోట్ల కొంత మంది విధ్వంసక శక్తులు మత ఘర్షణలు, విద్వేశాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, తమకు ఖచ్చితమైన సమాచారం ఉందని డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో తెలంగాణ పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉందన్నారు. అన్ని జిల్లాల పోలీస్ అధికారులు, కమిషనర్లు, కింది స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. అంసాఘిక, మతత్వశక్తులు, రౌడీ షీటర్స్‌పై నిరంతరం నిఘా పెట్టినట్లు తెలిపారు. విధ్వంసక శక్తుల విషయంలో పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఎవరైనా, ఎంతటివారైనా వెనుకాడేది లేదని డీజీపీ స్పష్టం చేశారు.సోషల్ మీడియా వేదికగా ప్రజల మనోభావాలను దెబ్బతీసి, సామరస్యపూర్వక వాతావరణాన్ని భగ్నం చేసే కుట్రలు జరుగుతున్నాయని డీజీపీ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాపై పోలీసు శాఖ నిఘా పెట్టిందని తెలిపారు. అనేక రకాల నూతన టెక్నాలజీని వినియోగించి రొచ్చగొట్టే పోస్టులు వచ్చినప్పుడు గుర్తించి, ప్రభావాన్ని తగ్గించి, నిజానిజాలను ప్రజలకు తెలియజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక శక్తుల వన్నాగంలో చిక్కుకోకుండా పోలీసులశాఖతో సమన్వయం చేసుకొని ప్రజలంతా సహాయ సహకారాలు అందించాలని కోరారు. సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి పోస్టులు వాటిని నమ్మొద్దని, ఇతరులకు షేర్ చేయకుండా దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల విషయంలో రాష్ట్రంలో కానిస్టేబుల్ నుంచి కమిషనర్లు, జోనల్ ఐజీల వరకు భాగస్వాములను చేశామని.. నిర్భయంగా, నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా గుర్తించి, చర్యలు తీసుకునేందుకు అప్రమత్తంగా ఉన్నామన్నారు.

# ఇప్పుడే ప్రధాని హైదరాబాద్‌కు ఎందుకు రావాలి

## కేంద్ర పెద్దలంతా వరదల సమయంలో ఎందుకు రాలేదు
## రాష్ట్రానికి నిధులు ఇచ్చేందుకు ఎందుకు వెనకాడారు
## మీడియా సమావేశంలో టిఆర్ఎస్ ఎంపి నామా నాగేశ్వర రావు

హైదరాబాద్,నవంబర్27 (ఆర్ఎన్ఎ):కేంద్రం నుంచి వచ్చే నిధులపై తెలంగాణ బతకడం లేదని, రాష్ట్రం నుంచి వెళ్తున్న డబ్బుపైనే కేంద్రం బతుకుతున్నదని ఎంపీ నామా నాగేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్రాల నిధుల్ఓనే కేంద్రంసోకు చేసుకుంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఆరేండ్లలో రాష్ట్రానికి, హైదరాబాద్‌కు ఏం చేసిందో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధిపై బీజేపీ నేతలు ఎప్పుడైనా పార్లమెంటులో మాట్లాడారా అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు అబద్దాలు, మోసపు మాటలు బెబుతున్నారని విమర్శించారు. కేంద్ర నిధులపై బీజేపీ నేతలు అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఆయన టీఆర్ఎస్ ఎంపీలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులపై లెక్కలు చెబుతామన్నారు. రాష్ట్రం నుంచి పన్నుల ద్వారా కేంద్రానికి రూ. 2.75 లక్షల కోట్లు వెళ్లాయని చెప్పారు. విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లలో పన్నుల ద్వారా రూ. 3 వేల కోట్లకుపైగా వెళున్నాయన్నారు. ఆ రూ. 3 వేల కోట్లలో కేవలం 30 శాతం మాత్రమే తెలంగాణకు ఇస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో పన్నుల ద్వారా వచ్చిన నిధులను ఇతర రాష్ట్రాల్లో వినియోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రచారం కోసమే కేంద్రమంత్రులంతా వస్తున్నారని, వరదల సమయంలో ఒక్కరు కూడా హైదరాబాద్‌కు ఎందుకు రాలేదని విమర్శించారు. గ్రేటర్ ఎన్నికల కోసం బీజేపీ అగ్రనేతలంతా పరిగెత్తుకుని వస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న నగరంలో చిచ్చు పెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు హైదరాబాద్‌కు రాని మోదీ, పరోక్షంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఇప్పుడు వస్తున్నారని మండిపడ్డారు. కరోనా వ్యాక్సిన్ మాటున వస్తున్న ప్రధాని మోదీ.. తన పర్యటన సందర్భంగా ఉచితంగా వ్యాక్సిన్ అని మాయ మాటలు చెప్పొద్దని సూచించారు. ఎన్నికల స్టంట్‌లో భాగంగా తెలంగాణకు వ్యాక్సిన్ ఉచితంగా ఇస్తామని ప్రకటిస్తారని చెప్పారు. బీహార్ ఎన్నికలప్పుడు కూడా ఇలాంటి హామీయే ఇచ్చారని విమర్శించారు. దేశమొత్తానికి ఉచితంగా ఇస్తామని చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఆరేండ్లలో హైదరాబాద్ నగర అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 60 వేల కోట్లకుపైగా ఖర్చుచేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు. గుజరాత్, కర్ణాటకలో వరద సాయం చేసి కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఎందుకు మొండి చేయి చూపిందని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టునైనా బీజేపీ తెచ్చిందా, కనీసం నవోదయ విద్యాలయాలను కూడా తేని దుస్థితి బీజేపీ నేతలదని ఎద్దేవా చేశారు. బీజేపీ మేనిఫెస్టోలో మెట్రో రైలులో మహిళలకు ఉచిత ప్రయాణం అని హామీ ఇచ్చారు. మరి ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఇలాంటి ప్రకటనే చేస్తే కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నేతలు వ్యతిరేకించారని గుర్తుచేశారు. కాళ్లకు చెప్పులు అరిగేలా తిరిగినా రీజినల్ రింగ్‌రోడ్డుకు అనుమతివ్వలేదని, న్యాయంగా రావాల్సిన డబ్బులు కూడా కేంద్రం ఇవ్వట్లేదని, అలాంటప్పుడు ఏమడిగినా ఇవ్వని బీజేపీకి ఎందుకు ఓట్లేయ్యాలని ప్రశ్నించారు. అభివృద్ధికి ఆటంకం కలగకుండా ఉండాలంటే కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు.

# ఢిల్లీలో ఉద్రిక్తంగా మారిన రైతుల ఆందోళన

## పోలీస్ నిర్బంధాన్ని లెక్కచేయకుండా మార్చ్
## వాటర్ కెనాన్, టియర్ గ్యాస్‌లతో అడ్డుకున్న పోలీసులు
## ఎట్టకేలకు నిరంకారీ భవన్ వరకు అనుమతి

న్యూఢిల్లీ,నవంబర్27(ఆర్ఎన్ఎ): ఆందోళన చేస్తున్న రైతులను ఢిల్లీలోకి రావడానికి అనుమతిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అలోక్ కుమార్ వర్మ తెలిపారు. అయితే రైతులు తమ నిరసనలను శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. వారికి బురారీ ప్రాంతంలోని నిరంకారీ సమాగమం మైదానాన్ని నిరసన తెలుపు కోవడానికి కేటాయించినట్లు అలోక్ చెప్పారు. పంజాబ్‌కు చెందిన క్రాంతికారీ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు దర్శన్ పాల్ స్పందిస్తూ.. తమను ఢిల్లీలోకి అనుమతించినట్లు తెలిపారు. తాము మొదట రామ్ లీలా మైదానంలో నిరసన తెలుపుతామని కోరినా పోలీసులు నిరాకరించారని, ఇప్పుడు తామంతా బురారీ ప్రాంతానికి వెళ్తున్నట్లు భారతీయ కిసాన్ యూనియన్ (రాజేవాల్) అధ్యక్షుడు బల్బీర్ సింగ్ రాజేవాల్ చెప్పారు. రైతులను ఢిల్లీలోకి అనుమతించడాన్ని పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ స్వాగతించారు. కేంద్రం వెంటనే రైతులతో చర్చలు మొదలుపెట్టాలని సూచించారు. ఇదిలావుంటే కేంద్రం తీసుకువచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ 'ఢిల్లీ చలో' మార్చ్‌లో భాగంగా ఢిల్లీ సరిహద్దుకు చేరిన రైతులను చెదరగొట్టేందుకు ఢిల్లీ పోలీసులు శుక్రవారం టియర్ గ్యాస్ ప్రయోగించారు. సరిహద్దుల్లో భారీగా చేరుకున్న రైతులు, బలగాల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీని హర్యానాతో కలిసి సరిహద్దు పాయింట్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పోలీస్ అధికారి మాట్లాడుతూ కొవిడ్ మహమ్మారి నేపథ్యంలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదని తెలిపారు. నిరసన తెలుపుతున్న రైతులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఢిల్లీకి వచ్చేందుకు అనుమతి ఇవ్వడం లేదని, వచ్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. సరిహద్దు వద్ద భద్రతను బలోపేతం చేశామని, ఇసుకతో నింపిన ట్రక్కులు, వాటర్ కెనాన్‌లను అందుబాటులో ఉంచారు. అలాగే నిరసనకారులు రాజధానిలోకి రాకుండా నిరోధించేందుకు ముళ్లకంచెలను సైతం ఏర్పాటు చేశారు. 30కిపైగా రైతు సంఘాలు రైతులు లాల్రూ, శంభు, పాటియాలా-పెహోవా, పత్రాన్-ఖానౌరి, మూనక్-తోహానా, రతియా-ఫతేహాబాద్, తల్వాండి-సిర్సా తదితర మార్గాల ద్వారా ఢిల్లీ వెళ్తామని ప్రకటించారు. పెద్ద సంఖ్యలో రైతులు సరిహద్దులకు చేరడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉదయం హర్యానా శివారులో రైతులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. మరో వైపు రైతుల ప్రదర్శనను దృష్టిలో పెట్టుకొని పోలీసుల వాహనాలు తనిఖీ చేస్తుండడంతో ఢిల్లీ-గురుగ్రామ్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అలాగే బోర్డర్‌లో సీఐఎస్ఎఫ్ సిబ్బందిని భారీగా మోహరించారు. ఢిల్లీ - బహదూర్‌గఢ్ సమీపంలో తిక్రీ సరిహద్దు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ కెనన్, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఢిల్లీకి వెళ్లేందుకు భద్రతా బలగాలతో ఘర్షణకు దిగుతున్నారు.

# భయానక వాతావరణం సృష్టించే కుట్రలో కెసిఆర్

## భయపడి బయటకు రాకుండా చేసే యత్నం
## అల్లర్లు సృష్టించే వారి సమాచారం ఉంటే ఎందుకు అరెస్ట్ చేయరు
## సిఎం కెసిఆర్, డిజిపిల తీరుపై మండిపడ్డ బండి సంజయ్

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): భయపెట్టి భయానక వాతావరణం సృష్టించేందుకు సీఎం కెసిఆర్ కుట్ర పన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఆరోపించారు. విధ్వంసం సృష్టించి... ఆ నింద బీజేపీపై మోపాలని చూస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్, డీజీపీ మహేందర్ రెడ్డి వ్యాఖ్యలపై బండి మండిపడ్డారు. కుట్రదారుల సమాచారం ఉంటే ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. కుర్మగూడ డివిజన్‌లో శుక్రవారం ప్రచారంలో పాల్గొన్న ఆయన.. సీఎం స్క్రిప్ట్‌ను డీజీపీ చదువుతున్నారని విమర్శించారు.

ఇది దిక్కుమాలిన చర్యగా వ్యాఖ్యానించారు. సమాచారం ఉంటే అరెస్ట్ చేసి, విధ్వంసాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. రోహింగ్యాలను తరిమికొడతామని, దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ అని ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'అంతా శివాజీలే కదా.. డూపులు ఎవరూ లేరు కదా.. పక్కా ఓటెయ్యాలి' అంటూ నవ్వులు పూయించారు. బీజేపీకి ఓటెయ్యాలని అభ్యర్థించారు. సీఎం కెసిఆర్ రాసిన స్క్రిప్ట్‌ను డీజీపీ చదువుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. విధ్వంసాలు జరుగుతాయనే సమాచారం ఉందని చెప్పిన సీఎం, డీజీపీ వారిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని అన్నారు. గ్రేటర్ ఎన్నికల్లో ఓటమి భయంతో సీఎం భయానక వాతావరణాన్ని సృష్టించాలని చూస్తున్నారు. ఓటర్లను బయటకు రాకుండా చూడాలని అనుకుంటున్నారు. సీఎం విద్వేషాలను రెచ్చగొట్టాలనే కుట్ర చేస్తున్నారు అంటూ బండి సంజయ్ సీఎం కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందు ధర్మం కోసం మాట్లాడితే బీజేపీని మతతత్వ పార్టీ అంటున్నారు అని బండి సంజయ్ అన్నారు. సీఎం కేసీఆర్ స్వార్థం కోసం యాగాలు చేస్తున్నారు. గోమాతను వధించే పార్టీ ఎంఐఎం. తెలంగాణను వ్యతిరేకంచిన పార్టీ ఎంఐఎం. అలాంటి పార్టీతో కేసీఆర్ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. హిందువులు వారానికి ఒక్క పండుగ చేసుకుంటే ఎంఐఎం నేతలకు ఇబ్బంది ఎందుకు అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు బండి సంజయ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికలు దేశద్రోహులకు, దేశ భక్తులకు జరిగేవి. ఎంఐఎంను, టీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించాలి. హైదరాబాద్ లో కేసీఆర్ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కేంద్ర నిధులు లేనిది ఏ అభివృద్ధి లేదు. కేంద్రం 2 లక్షల ఇళ్లు కేటాయిస్తే ఒక్క ఇల్లు కూడా కేసీఆర్ కట్టించలేదు. వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే కేసీఆర్ కనీసం బయటకు రాలేదు. కోవిడ్‌కు ఉచిత వైద్యం అందిస్తాం. ఉచితంగా కోవిడ్ టెస్టులు చేస్తామన్నారు. లక్ష ఉద్యోగాలు ఇస్తానని కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. ఓటును ఆయుధంగా ఉపయోగించుకొని టీఆర్ఎస్, ఎంఐఎంకు బుద్ధి చెప్పాలన్నారు. హిందువునని చెప్పుకోవడంకోసం కాషాయపు వస్త్రాలు ధరించి పేపర్లో ఫోటోలు వేసుకునే దౌర్భగ్యస్థితికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిగజారారని సంజయ్ విమర్శించారు. గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వివిధ ప్ఆరంతాల్లో రోడ్ షో నిర్వహించిన ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠాన్ని కాపాడుకోవడం కోసం, కేటీఆర్‌ను సీఎం చేయడం కోసం యాగాలు చేశారని ఆరోపించారు. కాషాయ వస్త్రాలు వేసుకుంటే సమాజం హిందువుగా గుర్తించిన విషయాన్ని తెలుసు కోవాలన్నారు. దేశద్రోహ పార్టీతో పొత్తుపెట్టుకుని తిరుగుతున్న ముఖ్య మంత్రికి సిగ్గుండాలన్నారు. 5 నిముషాల సమయం ఇస్తే హిందువులను నరికి చంపుతామని ఎంఐఎం పార్టీ వ్యాఖ్యలు చేసిందని, హిందూ దేవుళ్లను అవమానపరిచిందని సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎంఐఎం వ్యతిరేకించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో ఎంఐఎం పార్టీ పాల్గొనలేదని ఆరోపించారు. అలాంటి పార్టీతో ముఖ్యమంత్రి కేసీఆర్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంటే ఆయన ఎలాంటి హిందువో సమాజం గుర్తిస్తుందని సంజయ్ అన్నారు.

# రాజాసింగ్ ప్రచారంలో స్వల్ప ఉద్రిక్తత

## టిఆర్ఎస్, బిజెపి కార్యకర్తల పరస్పర నినాదాలు
## గ్రేటర్ పీఠం బిజెపిదే అన్న ఎమ్మెల్యే

హైదరాబాద్,నవంబర్27(ఆర్ఎన్ఎ): బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎన్నికల ప్రచారంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజాసింగ్ శుక్రవారం ఉదయం కేపీహెచ్‌బీ కాలనీ నుంచి రోడ్ షో ప్రారంభించారు. బాలాజీ నగర్ డివిజన్‌లో ఆయన రోడ్ షో జరుగుతున్న సమయంలో.. అదే దారిలో టీఆర్ఎస్ కార్యకర్తలు కూడా వచ్చారు. దీంతో ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు వెనక్కి వెళ్లాలంటూ టీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. అయితే తామేందుకు వెళ్లాలంటూ.. బీజేపీ శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంతం ఇరువర్గాల నేతల నినాదాలతో మారుమోగింది. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. ఈ ఘటనపై బీజేపీ నాయకులు స్పందిస్తూ.. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నేతలను వెనక్కి వెళ్లాలని టీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేయడం సరికాదని అన్నారు. ఇక, బాలాజీ నగర్ డివిజన్‌లో ప్రచారంలో భాగంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. గ్రేటర్ పీఠం దక్కించుకునేందుకు బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. తాము అధికారం చేపడితే అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. పీవీ నరసింహారావు, ఎన్టీఆర్ ఘాట్లపై ఎంఐఎం నేత అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు ఎందుకు తీసుకోరని ప్రశ్నించారు. ఎంఐఎం మతం పేరుతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుందని మండిపడ్డారు.గ్రేటర్ పోరులో బీజేపీ నేతల జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులతో పాటుగా ఆ పార్టీ జాతీయ నాయకులు హైదరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక, గ్రేటర్ ఎన్నికల్లో ముఖ్యంగా బీజేపీ, టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. విమర్శలు, ప్రతి విమర్శలతో గ్రేటర్ రాజకీయ వేడెక్కింది. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీలు తమ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తున్నారు. కాగా, డిసెంబర్ 1న జీహెచ్ఎంసీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.